హరీష్ రావు నివాసానికి కెటిఆర్




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

రైతులు పత్తి పొరక మండేలకు నిప్పు పెట్టడంతో ప్రమాదానికి గురై బెంబేలెత్తుతున్న వాహనదారులు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 139 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 17 మే 2025

# రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- వచ్చే మూడేళ్లలో మరింతగా పెరిగే ఛాన్స్
- డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తికి లక్ష్యం
- ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల అప్‌గ్రేడేషన్‌పై దృష్టి
- ఫ్యూచర్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్
- స్మార్ట్ పోల్స్ వినియోగంపై దృష్టి సారించాలి
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ స్పష్టీకరణ



**హైదరాబాద్,మే 16(పీసీడబ్ల్యూ న్యూస్):** వచ్చే మూడేళ్లలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు సబ్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. విద్యుత్‌శాఖపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. భవిష్యత్‌లో డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్ మారబోతోంది. విద్యుత్ లైన్ల ఆధునికీకరణపై దృష్టి సారించాలి. ఫ్యూచర్‌సిటీలో పూర్తిగా భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ విద్యుత్ టవర్లు, లైన్లు, స్తంభాలు కనిపించకూడదు. గ్రేటర్ పరిధిలో స్మార్ట్‌పోల్స్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఓఆర్‌ఆర్‌లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరినట్లు-అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025-26లో విద్యుత్ డిమాండ్ 18,138 మెగావాట్లకు

వివరాలు 2లో

# ఆపరేషన్ సిందూర్‌తో భారత్ శక్తి చాటాం

☛కేంద్ర హోం మంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ,మే 16(పీసీడబ్ల్యూ న్యూస్):** ఇటీవలి ఆపరేషన్ సిందూర్ భారతదేశపు త్రివిధ దళాల శక్తి సంపన్నతను ప్రపంచానికి చాటి చెప్పిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ప్రధాని మోడీ స్థిరమైన రాజకీయ సంకల్పం, మరోవైపు పలు కీలక సంస్థల నిర్దిష్ట ఇంటలిజెన్స్ సమాచార క్రోడీకరణ, దేశ సాయుధ బలగాల పోరాట పటిమ, ఈ మూడు అంశాలు భారత్ అంటే ఏమిటీ,మన శక్తి ఏ పాటిది? అనే కీలక విషయాలను వెల్లడించిందని వివరించారు. దేశ రాజధానిలో శుక్రవారం అధునాతన మల్టి ఏజెన్సీ సెంటర్ ప్రారంభం తరువాతి సభలో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు ఇంటలిజెన్స్ సమాచార సేకరణ , పలు సంస్థల మధ్య పంపిణీ, సముచిత సమన్వయం నిర్వహణకు ఈ కీలక కేంద్రం ఏర్పాటు- జరిగింది. ఓ ధృఢమైన నాయకత్వం, గురి తప్పని సమాచార సేకరణ, నిరుపమాన దాడుల శక్తియుక్తులు ఇప్పుడు దేశాన్ని మరింత శక్తివంతం

వివరాలు 2లో

# ఇప్పటి వరకు ట్రైలర్ మాత్రమే చూపాం

- అసలు సినిమా చూస్తామంటే చూపిస్తాం
- ఉగ్రవాదాన్ని ఆపకపోతే తడాఖా చూపుతాం
- మరోమారు పాక్‌కు రాజ్‌నాథ్ ఘాటు హెచ్చరిక
- భుజ్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన రక్షణ మంత్రి






# పిల్లలమర్రి చెంత... అందాల భామల కేరింత

**మహబూబ్ నగర్,మే 16(పీసీడబ్ల్యూ న్యూస్):** జిల్లా కేంద్రంలోని పిల్లల మర్రిలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ సందడి చేశారు.సుమారు 750 సంవత్సరాల చరిత్ర గల పిల్లల మర్రి చెట్టు- చరిత్రని గైడ్స్ వివరించారు. పిల్లల మర్రి చెట్టు దగ్గర ఏర్పాటు- పోతరాజు, బోనాలు ఆకట్టుకున్నాయి. 22 మంది అతివలు రెండు గ్రూపులుగా విడిపోయి

వివరాలు 2లో

# కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు

- రెండోరోజు పుణ్యస్నానం ఆచరించిన భట్టి దంపతులు



**కాళేశ్వరం,మే 16(పీసీడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు అట్టహాసంగా కొనసాగుతు న్నాయి. ఈ క్రమంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు శుక్రవారం సరస్వతి పుష్కరాలల్లో పుణ్యస్నానం చేశారు. పుష్కరాలకు వెళ్లిన భట్టి దంపతులకు వేద పండితులు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఘన స్వాగతం పలికారు. అనంతరం త్రివేణి సంఘమంలో భట్టి దంపతులు పుణ్యస్నానం ఆచరించారు. తర్వాత సరస్వతి మాత నదికి ప్రత్యేక పూజలు చేసి పట్టు చీరతో సారే అప్పజేప్పారు.

వివరాలు 2లో



# వేములవాడలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్

- సిరిసిల్లలో భూభారతిపై అవగాహన
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి

**సిరిసిల్ల,మే 16(పీసీడబ్ల్యూ న్యూస్):** వేములవాడకి కొత్తగా సబ్ రిజిస్టర్ ఆఫీస్ మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సిరిసిల్లలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన

వివరాలు 2లో

# మంత్రి కొండా సురేఖ నిజాలు మాట్లాడారు

- ☛తెలంగాణలో కాంగ్రెస్ కమిషన్ సర్కార్
- ☛ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన కెటిఆర్
- ☛తన వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేస్తున్నారన్న సురేఖ



**హైదరాబాద్,16(పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ లో గురువారం మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్య లు తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపాయి. మం త్రులు డబ్బులు తీసిన తర్వాతే ఫైళ్లపై సంతకాలు పెడతారని ఆమె చెప్పిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా శుక్రవారం స్పందించారు. కొండా మాట్లాడిన కొన్ని నిజాలకు అభినందనలు అని, తెలంగాణ లో ప్రస్తుతం కాంగ్రెస్ కమిషన్ సర్కార్ నడుస్తోందని విమర్శించారు. 30 శాతం కమిషన్ లేకుం డా ఫైళ్లపై మంత్రులు సంతకాలు పెట్టరని వారి సహచర మంత్రులే చెబుతున్నా

వివరాలు 2లో

# ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు

☛రైతులు దిగులు చెందాల్సిన పనిలేదు☛మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ



**సిరిసిల్ల,మే 16(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలుకి సంబంధించి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎక్కడైనా ఏదైనా మస్య ఉంటే తెలియ చేయాలని అన్నారు. జిల్లాలోని వేములవాడ అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయ్, వరి ధాన్యం కొనుగోలుపై మంత్రులు, సీఎస్, జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో జరుగుతున్న వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సన్న వడ్లు, దొడ్డ వడ్లు కొనుగోలు చేస్తుంది అన్నారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎస్ తో పాటు- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ జరిగిందని పేర్కొన్నారు. అయితే, అధిక తూకం లేకుండా, ధాన్యం తరలింపుకు రవాణా ఇబ్బందులు రాకుండా.. చర్యలు తీసుకోవడంతో పాటు- పేమెంట్ ఆలస్యం కాకుండా వెంట వెంటనే రైతుల ఖాతాల్లో పడేలా చర్యలు

వివరాలు 2లో

## పిల్లలమర్రి చెంత... అందాల భామల కేరింత

(మొదటి పేజీ తరువాయి)

టూరిస్ట్ ప్లేసులను సందర్శించారు. తెలంగాణ చరిత్రను తెలిపే శిల్పాలను పరిశీలించారు. పురావస్తు మ్యూజియాన్ని, రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. మే 17న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ స్పోర్ట్స్ ఫినాలే ఉండనుంది. మే 17న తెలంగాణ ఎక్స్ పీరియం ఎకో టూరిజం పార్క్ సందర్శన, తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్, కల్చరల్ ఈవెంట్. మే 19న కం-టె-స్టెంట్ల స్టేట్ సెక్రటేరియట్ టూర్, ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహం, తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్ విజిట్. మే 20, 21న టీ- హబ్ ఆధ్వర్యంలో కాంటినెంటల్ ఫినాలే. మే 21న శిల్పారామంలో ఆర్ట్స్, క్రాఫ్ట్స్ సెషన్ ఉంటుంది.

## కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు

(మొదటి పేజీ తరువాయి)

భట్టి సరస్వతి నది హారతి కార్యక్రమంలో పాల్గొని వీక్షించారు. భట్టి పర్యటన నేపధ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు-చేశారు. గురువారంనుంచి సరస్వతి పుష్కరాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమం వద్ద పవిత్ర సరస్వతి పుష్కర మహోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సీఎంకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సరస్వతి నదిలో మంత్రులతో కలిసి రేవంత్ రెడ్డి పుణ్యస్నానమాచరించారు. తర్వాత ఏకశిలా విగ్రహాన్ని ఆవిష్కరించి.. సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ఈ నెల 15 నుంచి 26 వ తేదీ వరకు 12 రోజులపాటు- సరస్వతీనది పుష్కరాలు వైభవంగ జరుగనున్నాయి . ఈ సమయంలో సరస్వతి నదితీరంలో పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తారు. ఏ నదిలో పుష్కరాలు జరుగుతున్నాయో ఆ నదిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తే పాపాల నుంచి విముక్తి కలుగుతుందని పండితులు చెబుతున్నారు. ప్రస్తుతం సరస్వతి నది పుష్కరాలకు సిద్ధమవుతుంది. తెలంగాణలోని కాళేశ్వరంలో సరస్వతినదిలో పవిత్ర స్నానాలు చేసేందుకు లక్షలాది మంది భక్తులు సిద్ధమవుతున్నారు. ఈ పుష్కరాలు కాళేశ్వరం ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను పెంచుతుంది. -టె-ంపుల్ టూరిజంపై తెలంగాణ ప్రభుత్వం చూపిస్తున్న ఆసక్తిని కూడా ప్రతిబింబించే అవకాశం ఉంది. భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు- చేస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణా రాష్ట్రంలోని కాళేశ్వరంలోని త్రివేణీ సంగమంలోను సరస్వతీ నదీ పుష్కరాలు జరుగుతాయి.

## ఆపరేషన్ సిందూర్‌తో భారత్ శక్తి చాటాం

(మొదటి పేజీ తరువాయి)

చేశాయని అమిత్ షా ఈ సందర్భంగా తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి తరువాత చోటు-చేసుకున్న మన అత్యంత కీలకమైన ఆపరేషన్ సిదూర ప్రధాని మోడీ చెక్కుచెదరని రాజకీయ చిత్తశుద్ధికి, మొక్కవోని ధక్షతకు నిదర్శనం అయిందని పేర్కొన్నారు. ఇక్కడ ప్రారంభం అయిన మల్టీ ఏజెన్సీ సెంటర్ దేశ ఇంటలిజెన్స్ బ్యూరో పరిధిలో పనిచేస్తుంది. 26/11 ముంబై దాడుల తరువాతి క్రమంలో దేశంలో పలు స్థాయిల నిఘా సమాచార వ్యవస్థల మధ్య సత్వర సమగ్ర రీతి సమన్వయానికి ఈ మల్టీ ఏజెన్సీ సెంటర్ ఏర్పాటు- జరిగింది. సకాలంలో సమాచారం సేకరించడం తరువాతి క్రమంలో పలు సంస్థల సమన్వయంతో తీసుకోవల్సిన చర్యల గురించి ఆలోచించి తాత్సారం లేకుండా స్పందించడం ఈ ఏజెన్సీ ముఖ్య ఉద్దేశం అన్నారు.

## హరీష్ రావు నివాసానికి కెటిఆర్

### - అమెరికాకు కవిత ప్రయాణం

**హైదరాబాద్,మే 16(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా, మాజీ మంత్రి, సిద్ధిపేట్ ఎమ్మెల్యే హరీశ్ రావు నివాసానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల పాటు- హరీష్ రావుతో సమావేశం అయినట్లు- తెలుస్తుంది. తాజా రాజకీయలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. దీంతో పాటు హరీష్ రావు తండ్రి ఆరోగ్య పరిస్థితిని కూడా కేటీఆర్ అడిగి తెలుసుకున్నట్లు- తెలుస్తుంది. అయితే, మరోవైపు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికాకు ప్రయాణమై వెళ్ళనున్నారు. తన కుమారుడి గ్రాడ్యుయేషన్ కార్యక్రమం కోసం ఆమె అమెరికాకు వెళ్తున్నారు. ఇప్పటికే యూఎస్ లో కవిత భర్త అనిల్ ఉన్నారు. ఈ నెల 23వ తేదీన తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. ఇటువంటి సమయంలో కేటీ-ఆర్, హరీశ్ రావు సమావేశం కావడం పార్టీ వర్గాల్లో ఉత్కంఠ రేపుతుంది. కాగా శుక్రవారం ఉదయం మాజీ మంత్రి హరీష్‌రావు నివాసానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు.



## రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతుందని, 2034-35 నాటికి విద్యుత్ డిమాండ్ 31,808 మెగావాట్లకు చేరుతుందని అధికారులు వివరించారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది అత్యధికంగా 17,162 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని సీఎంకి అధికారులు వివరించారు. గత ఏడాదితో పోల్చితే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగింది అన్నారు. 2025-26లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగు తుందని అంచనా వేశారు. 2034-35 నాటికి 31,808 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు- ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది అన్నారు. విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలి.. రైల్వే లైన్లు, మెట్రో, ఇతర మాస్ ట్రాన్స్ పోర్టులకు విద్యుత్ అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు- ఇతర కార్పొరేషన్లలో విద్యుత్ అవసరాలను లెక్కలోకి తీసుకోవాలి.. కొత్తగా ఏర్పాటు- చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ ను దృష్టిలో పెట్టు-కుని ముందుకు కొనసాగాలని చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్ గా మారబోతుంది.. హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నా మని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్‌ఎండీఏతో సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలన్నారు. విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైనా దృష్టి సారించాలి.. ఫ్యూచర్ సిటీలో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు- చేయాలని ఆయన తెలిపారు. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదు.. హై టెన్షన్ లైన్లను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు- చేయాలని సూచించారు. అలాగే, సెక్రటె-రియట్, నెక్లస్ రోడ్, కేబీఆర్ పార్కు లాంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ను అందుబాటులోకి తీసుకు రావాలని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# ఇప్పటి వరకు ట్రైలర్ మాత్రమే చూపాం

- అసలు సినిమా చూస్తామంటే చూపిస్తాం
- ఉగ్రవాదాన్ని ఆపకపోతే తడాఖా చూపుతాం
- మరోమారు పాక్‌కు రాజ్‌నాథ్ ఘాటు హెచ్చరిక
- భుజ్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన రక్షణ మంత్రి

**భుజ్, 16(పీసీడబ్ల్యూ న్యూస్):** దేశ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌కు మాస్ వార్నింగ్ ఇచ్చారు. పాక్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆపరేషన్ సిందూర్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు చూసిందంతా ఓ ట్రైలర్ మాత్రమేనని అన్నారు. శుక్రవారం భుజ్ ఏయిర్‌బేస్‌లో రాజ్‌నాథ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ అధికారులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ.. ' ఆపరేషన్ సిందూర్ ముగియలేదు. ఇప్పటి వరకు చూసిందంతా ట్రైలర్ మాత్రమే. సరైన సమయం వచ్చినపుడు ప్రపంచం మొత్తానికి పూర్తి సినిమా చూపిస్తాం. పాకిస్తాన్‌ను ఇప్పుడు ప్రొబేషన్ పీరియడ్‌లో పెట్టాము. పాక్ తన బుద్ధి మార్చుకుంటే పర్లేదు. లేకపోతే కఠినమైన శిక్షలు వేస్తాం' అని అన్నారు. ఏయిర్‌ఫోర్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏయిర్‌ఫోర్స్ అధికారుల పని తీరును పొగడటానికి తనకు మాటలు సరిపోవటం లేదన్నారు. యావత్ దేశం తరపునుంచి మరోసారి ఏయిర్‌ఫోర్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాకిస్తాన్ గడ్డమీద ఉన్న 9 ఉగ్రవాద స్థావరాలను మీరు ఎలా ధ్వంసం చేశారో ప్రపంచం మొత్తం చూసింది. తర్వాత కూడా వారి ఏయిర్‌బేస్‌లను ధ్వంసం చేశారు. భారత్ యుద్ధ నియమాలు, టెక్నాలజీ మారిందని ప్రపంచానికి మీరు చాటి చెప్పారు. ధైర్య, సాహసాలకు ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ ప్రతీకగా నిలిచింది. ఏయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌కు నా కృతజ్ఞతలు. అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు' అంటూ పొగడ్తల వర్షం కురిపించారు.గురువారం జమ్మూకాశ్మీర్ పర్యటనలో భాగంగా పాకిస్తాన్‌పై ఫైర్ అయ్యారు. పాకిస్తాన్ దగ్గర ఉన్న అణు బాంబులను లాక్కోవాలని ఇంటర్ నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీకి విజ్ఞప్తి చేశారు. పాకిస్థాన్ ఎన్నోఏళ్లుగా పెంచి..పోషిస్తున్న ఉగ్రవాదాన్ని భారత సైన్యం కేవలం 23 నిమిషాల్లో తుడిచిపెట్టేసిందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం పాక్ చర్యలను భారత్ పరిశీలిస్తుందని.. తేడా వస్తే చర్యలు మరింత కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. గుజరాత్‌లోని భుజ్ వైమానిక దళ సైనికులతో సమావేశమైన కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి వచ్చిన నిధులలో ఎక్కువ భాగాన్ని పాకిస్థాన్ తన దేశంలో ఉగ్రవాద మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేస్తుందన్నారు. అప్పు చేసి మరీ దాయాది దేశం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్రవాద స్థావరాలను పునర్నిర్మించడానికి జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు రూ.14 కోట్ల ఇస్తున్నట్లు పాక్ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని రాజ్‌నాథ్ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టు-కొని ఐఎంఎఫ్ పాక్‌కు నిధులు సమకూర్చడంపై పునరాలోచించాలని కోరారు. భవిష్యత్తులోనూ ఆ దేశానికి ఎలాంటి సహాయం అందించొద్దని కోరారు. ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు భారత్ అర్ధరాత్రి ఉదయపు వెలుగు ఎలా ఉంటు-ందో చూపించిందని.. మన సైనికుల పరాక్రమం చూసి దేశ, విదేశాల్లోని భారతీయులు గర్విస్తున్నారని రాజ్‌నాథ్ అన్నారు. ఈ ఆపరేషన్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని తెలిపారు. మన బ్రహ్మోస్ క్షిపణి శక్తిని దాయాది దేశం కూడా అంగీకరించిందని పేర్కొన్నారు. భుజ్ వైమానిక స్థావరం అనేక పాకిస్థాన్ డ్రోన్‌లను కూల్చడాన్ని ప్రస్తావిస్తూ..సైన్యాన్ని ప్రశంసించారు. 1965లోనూ పాకిస్థాన్‌పై మన విజయానికి భుజ్ సాక్షిగా నిలిచిందని గుర్తు చేశారు. ఇదిలావుంటే ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్‌కు రుణం ఇవ్వకూడదని భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసినప్పటికీ అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు-) ఆ దేశానికి మంజూరయ్యాయి. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గురువారం జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు నష్టపరిహారం ఇవ్వనున్నట్లు- ప్రకటించారు. భారత్ చేసిన వైమానిక దాడుల్లో 14 మంది మసూద్ కుటు-ంబసభ్యులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని ఆ దేశ ప్రధాని పేర్కొన్నారు. కేవలం మసూద్ కుటు-ంబానికి రూ.14 కోట్లు-చెల్లించే అవకాశం ఉంది. అదనంగా భారత్ దాడుల్లో ధ్వంసమైన ఇళ్లను పునర్నిర్మిస్తామని పాక్ ప్రధాని హామీ ఇచ్చారు.

## ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవడం జరుగుతుంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులకు ఏమైనా ఇబ్బంది కలిగితే టోల్ ఫ్రీ నెంబర్ కి ఫిర్యాదు చేయండి అని సూచించారు. కానీ, రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు అని కోరారు. ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగింది.. పంట ఎండి పోయిందనే అవకాశం లేకుండా విద్యుత్ ఇబ్బందులు లేకుండా, నీటిని వాడుకుంటూ పంటలు కాపాడుకున్నాం అన్నారు. మాది రైతుల ప్రభుత్వం అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.

## ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం

- ఆర్మీకి కృతజ్ఞతగా నేడు బిజెపి తిరంగా యాత్ర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,మే 16(పీసీడబ్ల్యూ న్యూస్):** భారత్‌పై దాడి చేస్తే ప్రతిదాడి ఎలా ఉంటుందో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు నిరూపించామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పాక్ దిక్కుతోచని స్థితిలో కాళ్ల బేరానికి వచ్చిందని అన్నారు. దాని వైమానిక స్థావరాలు భారత్ దాడిలో ధ్వంసం అయ్యాయని అన్నారు. ఉగ్రవాదులకు ఊతమిస్తే ఇక పాక్ అంతుచూస్తామని ప్రధాని మోడీ హెచ్చరించారని అన్నారు. ప్రధాని మోదీ ఉగ్రవాదుల అంతు చూస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పాక్‌తో పోరులో భారత సైన్యం చరిత్ర రాసే ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. భాజపా నిర్వహించే తిరంగా యాత్రలో అందరూ పాల్గొనాలని కోరారు. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచే ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసింది. పాక్ ఆర్మీకి చెందిన 11 కీలకమైన స్థావరాలను మన దేశ సైనికులు ధ్వంసం చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శనివారం సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్ద తిరంగా యాత్ర నిర్వహిస్తున్నాం. అంబేద్కర్ విగ్రహం నుంచి మిలటరీ ట్యాంక్ వరకు ఈ యాత్ర ఉంటుందన్నారు. అనేక మంది ప్రముఖులు ఈ యాత్రలో పాల్గొనబోతున్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ తిరంగా యాత్రలో ఎమ్మెల్యేలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇది సైనికులకు ఆత్మస్థైర్యం నింపేలా, వారికి మద్దతుగా చేస్తున్నదని అన్నారు. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. ఇకపోతే ఈ దాడితో భారత సైనికపాటవాన్ని ప్రపంచం గుర్తించిందని అన్నారు.



## మంత్రి కొండా సురేఖ నిజాలు మాట్లాడారు

(మొదటి పేజీ తరువాయి)

రని, సచివాలయం లోపల కాంట్రాక్టర్లు ధర్నాలు చేయడం చూస్తే, ఈ వ్యవస్థలో కమిషన్ వ్యవహారం ఎంత లోతుగా ఉందో స్పష్టమవు తోందన్నారు. మంత్రుల పేర్లను బహిర్గతం చేసి ప్రజలకు సత్యం చెప్పాలని కొండా సురేఖని కోరుతున్నానని, రేవంత్ రెడ్డి లేదా రాహుల్ గాంధీ, ఈ ఆరోపణలపై విచారణకు ఆదేశిస్తా రా? అంటూ కేటీఆర్ విమర్శల వర్షం కురిపిం చారు. అయితే దీనిపై కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తాను చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ తప్పుగా ప్రచారం చేస్తోందని, తన మాటల ఉద్దేశం గత ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులపైనేనని స్పష్టం చేశారు. పనులకు అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారు అన్నదే నా మాట. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలపై ఎలాంటి విమర్శలు చేయలేదంటూ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారానికి తావు ఇవ్వడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు. ఓ అభివృద్ధి కార్యక్రమానికి భూమి పూజ సందర్భంగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. వరంగల్‌లోని కృష్ణా కాలనీలో బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.4.5కోట్లతో భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. 'క్లియరెన్స్ కోసం మంత్రుల వద్దకు కొన్ని ఫైల్స్ వస్తుంటాయి. మామూలుగా మంత్రులు అలాంటి ఫైల్స్ వచ్చినప్పుడు డబ్బులు తీసుకుని క్లియరెన్స్ ఇస్తుంటారు. మేం మాత్రం మాకు నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు.. సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం' అని ఆమె వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది.తన వ్యాఖ్యలు కలకలం సృష్టించడంతో కొండా సురేఖ వివరణ ఇచ్చారు. భారాస ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు. ఇలా తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు. ఏ పని-కై-నా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారని అన్నానని తెలిపారు.

## వేములవాడలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి చట్టం నలుగురి మధ్యలో నలుగురి కోసం మాత్రమే తయారు చేశారని.. భూ భారతి మాత్రం పేదల చట్టమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా మన భూ భారతి చట్టం మోడల్‌గా తీసుకునే విధంగా ఉంటుందన్నారు. ధరణి చట్టంతో అనాడు పేద ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ప్రతి భూ సమస్యను పరిష్కారమే విధంగా భూ భారతి చట్టం రూపొందించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 283 సర్వేయర్‌లు ఉన్నారు. కొత్తగా 6 వేల మంది సర్వేయర్లు ఏర్పాటు- చేస్తున్నామని తెలిపారు. 953 రెవెన్యూ గ్రామాల్లో వీఆర్ఎస్, వీఆర్వోలు ఉండే వారని.. బీఆర్ఎస్ వల్ల వాళ్లంతా రోడ్ల పాలయ్యారని విమర్శించారు. ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తున్నామని చెప్పారు. అనాడు భూ సమస్య వస్తే కోర్టుకి వెళ్లాల్సి ఉండేదని.. కానీ ఇప్పుడు మన దగ్గరే సమస్య పరిష్కారం చేసుకోవచ్చని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో 1500 అప్లికేషలు వచ్చాయని.. అవి జూన్ 2 వరకు పూర్తి స్థాయిలో పరిష్కారం అవుతాయన్నారు. మీ సమస్యలు చెబితే రెవెన్యూ అధికారులు మీ దగ్గరికే వస్తారని.. ఇందిరమ్మ ప్రభుత్వంలో చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారం జరుగుతుందని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు జాగ్రత్తగా ఉండాలని.. రైతులను ఇబ్బంది పెట్టవద్దు, మీరు కూడా రైతు బిడ్డలేనని అన్నారు. ఏ అధికారి అయినా రైతులను ఇబ్బంది పెడితే వారిపై చర్యలు తీసుకునే విధంగా చట్టం ఉందని గుర్తు చేశారు.

# అమెరికాలో జయ హాస్పిటల్(ఎండి) డాక్టర్ తౌటిరెడ్డి నర్సింగారెడ్డికి ఘనంగా సన్మానం..







**హనుమకొండ, మే 16(పీసీడబ్ల్యూ న్యూస్):** అమెరిక న్యూజెర్సీ తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో హన్మకొండ జయ హాస్పిటల్ యండి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ తౌటిరెడ్డి నర్సింగారెడ్డిని అమెరికా న్యూజెర్సీలో పింగల్ భగవాన్ రెడ్డి ఆధ్యక్షతన ఘనంగా సన్మానించారు. మన తెలంగాణ ముద్దుబిడ్డ డాక్టర్ టి నర్సింగారెడ్డి ని అమెరికాలో స్థిరపడ్డ ప్రవాస భారతీయ వ్యాపారవేత్తలు తెలంగాణ తెలుగు వారు అందరు కలసి ఆప్యాయంగా సన్మానించి గౌరవించడం గౌరవాన్ని, సంతోషాన్ని ఇచ్చిందని వారన్నారు. వరంగల్ ముద్దు బిడ్డ చిన్న వయస్సులోనే అంచెలంచెలుగా ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐమ్ఏ అధ్యక్షులుగా , ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ అధ్యక్షునిగా, జాతీయ మెడికల్ సంఘం ఉపాధ్యక్షుడుగా, సమాజ సేవకుడిగా సేవలందించడం మనకెంతో గర్వకారణం అని పింగల్ భగువాన్‌రెడ్డి, తోట రవీందర్, దత్తారెడ్డి, శ్రీనివాసరెడ్డి,మల్లారెడ్డి, గోపి,క్రిష్ణ,లక్ష్మారెడ్డి, డాక్టర్ శ్రీపాల్ బాబా,ధ్రువ,డాక్టర్ శ్రీధర్ మొదలగు వారు అన్నారు. అనంతరం సన్మాన గ్రహీత డాక్టర్ టి నర్సింగారెడ్డి మాట్లాడుతూ..అమెరికాలో స్థిరపడ్డ ప్రవాస భారతీయులు అందరు కలసి నన్ను సన్మానించడము సంతోషంగా ఉందని, సప్తసముద్రాలు దాటి వచ్చి వ్యాపార రీత్యా అమెరికాలో రోజువారి బిజీగా ఉండి వర్కింగ్ రోజు అయిన పెద్ద ఎత్తున హాజరై మన తెలంగాణ బిడ్డపై మీరు చూపించిన ఆదరాభిమానం, నాకు మీరు చేసిన ఘన సన్మానం ముఖ్యంగా బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, భగువాన్ రెడ్డి స్నేహితులను నా జీవితం లో మరచి పోలేనిదని మరుపురానిదని, మీరు తెలంగాణ అభివృద్దిలో కూడ మీ వంతు సహాయసహకారాలు ఉండాలని కోరుచూ అందరికి క్రుతజ్ఞతలు తెలిపారు.

# జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ

**● జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి**





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, మే 16,(పిసిడబ్ల్యూ న్యూస్):**జాతీయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కాప్రా కార్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి. కర్నన్ ఆదేశానుసారం డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ డి. రమేష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి విచ్చేసి అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కాప్రా సర్కిల్ కార్యాలయం నుండి కమలానగర్ మీదిగా ఈసీఐఎల్ చౌరస్తా వరకు ప్లకార్డ్స్ పట్టుకొని నినాదాలు చేస్తూ కాప్రా సర్కిల్ ఆఫీస్ కు చేరుకన్నారు. ర్యాలీ అనంతరం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ఎగ్జిబిషన్ ను కార్పొరేటర్ తిలకించి వివిధ దశల లార్వాను చూసి, ఇన్ సెట్ కలెక్టర్ సేకరించిన లైవ్ ఎడిస్ మస్కిటోను చూసి దోమ యొక్క జీవిత చక్రం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎగ్జిబిషన్ తిలకించడానికి విచ్చేసిన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలలో నీటి నిలువలు ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటి నిలువెలపై మూతలు ఉంచుకోవాలని, వ్యాధి బారిన పడిన వారు వెంటనే దగ్గరలోని బస్తీ దవఖానాలో ట్రీట్ మెంట్ పొందాలని సూచించారు. కాప్రా అసిస్టెంట్ ఎంటామాలజిస్ట్ డి. రమేష్ మాట్లాడుతూ జాతీయ డెంగ్యూ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. డెంగ్యూ వ్యాధి ఆడ ఎడిస్ దోమ ద్వారా వ్యాప్తి చెందే వైరల్ డిసీస్ అని, ఇది వచ్చినప్పుడు తీవ్ర మైన జ్వరం, తలనొప్పి, కంటి వెనుక భాగంలో నొప్పి, చర్మంపై దద్దుర్లు ఏర్పడుతూ అప్పుడప్పుడు రక్తస్రావం కూడా జరిగే అవకాశం ఉంటుందని వివరించారు. వ్యాధి నివారణ కంటే వ్యాధి రాకుండా చూసుకోవడమే చాలా ముఖ్యమని ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్ అని సూచించారు. కార్యక్రమంలో లోకల్ లీడర్స్ శానిటేషన్ విభాగం సానిటరీ సూపర్ వైజర్ సుదర్శన్, శానిటేషన్ స్టాప్ తోపాటు ఎంటమాలజీ సూపర్వైజర్స్,ఎంటమాలజి స్టాఫ్, ఇన్ సెట్ కలెక్టర్స్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కర్టసి డే శుభాకాంక్షలు తెలిపిన డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీ




**నర్సంపేట, మే 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఆర్టీసీ నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీ ఆధ్వర్యంలో బస్టాండ్ యందు ప్రయాణికులకు గులాబీ పుష్పాలు అందించి బస్సులో రెగ్యులర్గా ప్రయాణం చేసే నర్సంపేట కి చెందిన చల్ల సోమ నర్సయ్య, కమలాపురం కి చెందిన ముత్తినేని శ్రీలత ను శాలువాలతో సన్మానం చేసి మర్యాద పూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేసారు. డిపో ఉద్యోగులకు గేట్ మీటింగ్ ద్వార ప్రయాణికులను చిరునవ్వు తో పలకరించి మర్యాద పూర్వకంగా ఉండాలని తెలియజేసారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్ యాదగిరి ని శాలువాతో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ , అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్ డిపో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జడ్పిహెచ్ఎస్ ఉపాధ్యాయురాలకు సన్మానం

**- ప్రధానోపాధ్యాయుడు బి శంకర్ నాయక్**



**సిరోలు, మే 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలం చింతపల్లి గ్రామ జడ్.పి.హెచ్.ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతిలో 500 పైగా మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకి ఫ్లైట్ ఎక్కిస్తానని పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు లావణ్య. విద్యార్థులకు మోటివేషన్ చేస్తూ ప్రైవేట్ పాఠశాలలకు పోటీగా విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థులను ఫ్లైట్‌లో తీసుకెళ్ల డం జరిగింది. వారికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఉపాధ్యాయురాలికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ నాయక్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకన్న , ఉపాధ్యా య బృందం లావణ్యకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది.

# ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన జర్నలిస్టులు

**● అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని హామీ**

**● ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రు నాయక్**



**కురవి, మే 16(పిసిడబ్ల్యూ న్యూస్):** అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, అలాగే రాజీవ యువ వికాస్ పథకం కల్పించాలని కోరుతూ శుక్రవారం మరిపెడ మండలం కేంద్రంలోని ఆర్ ఎం బి గెస్ట్ హౌస్ లో డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ..,అర్హులైన జర్నలిస్టులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయు మండల అధ్యక్షులు గుంటి సురేష్, ఐజేయు దాడుల నియంత్రణ కమిటీ జిల్లా కో- కన్వీనర్ బేతమల్ల సహదేవ్,జిల్లా కౌన్సిల్ సభ్యులు పూర్ణచంద్రరావు, ఐజేయు మండల ఉపాధ్యక్షులు గండమాల రోశయ్య,సీరోలు మండలం ప్రధాన కార్యదర్శి మడ్డి వీరన్న,కోశాధికారి చల్ల వేణు,జర్నలిస్ట్ నాయకులు పొన్న బోయిన వెంకన్న, బాలు నాయక్ పాల్గొన్నారు.

# వరంగల్ అర్బన్ సహకార బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

**● హనుమకొండ జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి**



**హనుమకొండ, మే 16(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ అర్బన్ సహకార బ్యాంకు సేవలను అందరూ వినియోగించుకోవాలని హనుమకొండ జిల్లా సహకార అధికారి బి. సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రశాంత్ నగర్ లోని వరంగల్ అర్బన్ సహకార బ్యాంక్ బ్రాంచ్ లో సమావేశాన్ని నిర్వహించారు. బ్రాంచ్ లో సభ్యులు, డిపాజిటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రతి సభ్యుడు స్వయం సహాయం, సమిష్టి బాధ్యత, సమానత్వం సామాజిక బాధ్యతతో సహకార బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. ప్రజా బ్యాంకుగా అభివృద్ధి చేసి బ్యాంకు ద్వారా సేవలు పొందాలని కోరారు. ప్రతి సభ్యుడు పొదుపు ద్వారా వాటాధనం చెల్లించడం ద్వారా బ్యాంకు పరపతిని పెంచుతుందని అన్నారు. బ్యాంకులో లాకర్ల సౌకర్యం ఉందని, ప్రజలు అందరు వినియోగించు కోవాలని కోరారు. ఈ ప్రాంత ప్రజలకు కోర్ బ్యాంకింగ్ సిస్టం ఏటీఎమ్స్, అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహణాధికారి ప్రసాద్, బ్యాంకు మేనేజర్ సురేందర్ రెడ్డి, హనుమకొండ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, గోపాలపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, డిపార్ట్మెంట్ అధికారులు శ్రీనివాసరావు కృష్ణవేణి, సంధ్యారాణి, బ్యాంకు వాటాదారులు సభ్యులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో మూడు పాడి గేదెల మృతి



**బయ్యారం,మే 16(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలో విద్యుత్ వైర్లు తెగిపడి మూడు పాడి గేదెలు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గురువారం అర్థరాత్రి ఈదురు గాలులతో పంట పొలల్లో ని విద్యుత్ తీగలు నేలపై పడిపోవడంతో రైతు పాండవుల లింగయ్య కు చెందిన మూడు పాడి గేదెలు కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి.మృతి చెందిన గేదెల విలువ సుమారు రెండు లక్షల రూపాయలకు పైగా ఉంటుందని రైతు లింగయ్య తెలిపారు,పాడి గేదెలే జీవనధారంగా బ్రతుకుతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# రైతులు పత్తి పొరక మండేలకు నిప్పు పెట్టడంతో ప్రమాదానికి గురై బెంబేలెత్తుతున్న వాహనదారులు



**పరకాల, మే 16(పిసిడబ్ల్యూ న్యూస్):** కంఠాత్మకూర్ రామకృష్ణాపురం నుండి హనుమకొండ కు వెళ్లే ప్రధాన రహదారిపై రైతులు మొక్కజొన్న సొప్ప పత్తి పొరక మండేలను విచ్చలవిడిగా ఎలాంటి ప్రమాద నివారణ చర్యలు లేకుండా, నిప్పు పెట్టడంతో రోడ్డు పక్కనే ఉన్నటువంటి ఎండు కొమ్మలు చెట్లు, కేబుల్ వైర్లుకు ఒక్కసారిగా మంటలు అంటుకొని, పొగ కమ్ముకుని ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అటువైపుగా వెళ్లాలంటేనే బెంబేలెత్తుతున్నారు. గురువారం రామకృష్ణాపూర్ గ్రామ శివారులో స్కార్పియో, ఆటో ప్రమాదానికి గురైంది. కంటాత్మకూరు నుండి రామకృష్ణాపురం గ్రామం మీదుగా హనుమకొండ వెళ్తున్న స్కార్పియో, హనుమకొండ నుండి పరకాల కు వస్తున్న ఆటోకూ, ఒకసారిగా మంటలు ఎగసిపడి ఆటో వైపుకు రావడంతో ఆటో డ్రైవర్ అదుపుతప్పి స్కార్పియో వాహనానికి “ఢీ” కొట్టడంతో రెండు వాహనాల్లో ఉన్నటువంటి వ్యక్తులకు కాళ్లు చేతులు తలకు దెబ్బలు తాకడంతో వెంటనే 108 ద్వారా ఎంజిఎం తదితర ప్రైవేటు హాస్పిటల్స్ లో చికిత్స పొందుతున్నారు ఈ ప్రమాదానికి కారణం ఎవరు? అనేది నిప్పంటించిన వారు ఎక్కడున్నారు? ఎవరు చేస్తున్నారు? ఎండాకాలంలో ఫైర్ స్టేషన్ హనుమ తుల్లేకుండా ప్రధాన రహదారులపై నిప్పు పెట్టడం ఏంటని వాహనాదారులు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన కుటుంబాలకు ఎవరు న్యాయం చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇట్లాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై ఎవరు చర్యలు తీసుకుంటారని, నిన్నటి ప్రమాదంతో నైనా ఆర్ అండ్ బి, ఫైర్, పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారా? అని వాహన దారులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చర్య తీసుకుంటేనే.. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా ఉంటాయని ప్రజలు వాపోతున్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం









**గంగాధర, మే 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని ఇస్లాంపురం గ్రామంలో ఆంజనేయ స్వామి మాల వేసుకున్న వారు కాలినడకన నిన్న రాత్రి కొండగట్టు పోతున్న క్రమం లో ఇస్లాంపూర్ దగ్గరికి చేరుకునేసరికి కొండి శ్రీనివాస్ గర్షకుర్తి ఆంజనేయ స్వామి మాల వేసుకున్న వ్యక్తిని అదే రూట్ లో పూడూరు కి వెళ్తున్న గౌరాపురానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైకుపై ఉన్న ఇద్దరు వ్యక్తులు కాసాని గణేష్, కాసాని రాజు లా బైకు ఢీకొని యాక్సిడెంట్ అవ్వగా కాసాని గణేష్ , కొండి శ్రీనివాస్ ఆస్పత్రి తరలిస్తున్న క్రమంలో మృతి చెందగా కాసాని రాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.దీనిపై కేసు నమోదు చేసి చట్టరీత్యాచర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు.

# ఘనంగా వీరభద్ర స్వామికి బండ్ల ఊరేగింపు

**టేక్మాల్, మే 16 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మాట్ పల్లి గ్రామంలో గుట్టపై వెలసిన వీరభద్ర స్వామి వారి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి బండ్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డప్పు.చప్పుళ్ళు. ఆట పాటలతో చేసిన ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలోప్రజలు తరలివచ్చారు. అనంతరం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



## ఎంపీ డాక్టర్ కడియం కావ్యని, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసిన నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**హనుమకొండ, మే 16(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ కనక దుర్గ కాలనీలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో వరంగల్ పార్ల మెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యని, మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని శు క్రవారం కాంగ్రెస్ పాలకుర్తి ఇన్చార్జి హనుమండ్ల ఝాన్సీ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

## బీరప్ప గుడి సన్నిధానంలో హనుమాన్ మాలదారులకి అన్నప్రసాద వితరణ

**- శ్రీ సిద్దేశ్వర స్వామి ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎగ్గిడి ఉప్పలయ్య, ఎగ్గిడి సంపత్**

**యాదాద్రి మే 16(పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మరియు పట్టణంలోని బీరప్ప గుడి సన్ని ధానంలో హనుమాన్ మాలదారులకి శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆటో యూనియన్ అధ్యక్షులు ఎగ్గిడి ఉప్పలయ్య వారి కుమారుడు ఎగ్గిడి సంపత్ లు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిపిం చారు. హనుమాన్ మాలదారులు ఉప్పలయ్యని శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వామి భక్తులు, మాలదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి మే 16(పిసిడబ్ల్యూ న్యూస్):** యాదా ద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం )మండలం లింగరాజుపల్లి ,పల్లెర్ల గ్రామాల్లోని పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాలను శుక్రవారం రోజున జిల్లా కలెక్టర్ ఎం హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులను సమస్యలు అడిగి తెలుసుకుని లారీల కొరత లేకుండా లారీలను పంపించాలని కాంట్రాక్టర్ యాదయ్యను చరవాణి ద్వారా హెచ్చరించారు. సక్రమంగా లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించకపోతే కాంట్రాక్టును రద్దుచేయవలసి ఉంటదనీ, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో కాంట్రాక్టరు తక్షణమే లారీలను సమకూరుస్తానని కలెక్టర్ కి విన్నవించుకున్నారు. వీరివెంటా ఆత్మకూరు తహసీల్దార్ వి లావణ్య, ఆర్ఐ మల్లిఖార్జున్ రావు, కొనుగోలు కేంద్రం నిర్వహకులు చిత్తర్ల నరేష్,రైతులు ఉన్నారు.



## బిజెపి నాయకుల సంబరాలు విడ్డూరం...

- న్యాయ కళాశాల మంజూరులో మంత్రి పొన్నం కృషి
- లీగల్ సెల్ జిల్లా చైర్మన్ కల్లేపల్లి లక్ష్మయ్య



**కరీంనగర్,మే16(పీసీడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం కరీంనగర్ కు న్యాయ కళాశాలను మంజూరు చేస్తే బిజెపి నాయకులు తమ ఖాతాలో వేసుకోవడం విడ్డూరమని కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా చైర్మన్ కల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. బిజెపి నాయకుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీకి న్యాయ కళాశాలను మంజూరు చేయడంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. గతంలో న్యాయ కళాశాల మంజూరైన సందర్భంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కి , రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్రమంతా సంబరాలు చేసుకోవడం జరిగిందన్నారు. న్యాయ కళాశాల మంజూరు పై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలపడంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన కృషి ఏమీ లేదన్నారు. ప్రజల్లో , మేధావుల్లో విద్యావంతులో ఎక్కడ తమ ఉనికి కోల్పోతామోననే ఉద్దేశంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు శాతవాహన యూనివర్సిటీ ఎదుట ఈ కార్యక్రమం చేశారన్నారు. అంతేకాకుండా ప్రధానమంత్రి మోడీకి పాలాభిషేకం నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు తీసుకొచ్చి జిల్లాను అభివృద్ధి చేసి తమ సత్తా చాటాలి కానీ రాష్ట్ర ప్రభుత్వ కృషిని తమ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ స్టేట్ జాయింట్ కన్వీనర్ భూక్య రజనీష్, జిల్లా వైస్ చైర్మన్ వడ్లూరు కృష్ణ, జిల్లా కన్వీనర్లు కొత్తకొండ శంకర్, లింగంపల్లి శ్రీకాంత్, కో కన్వీనర్ ఐతు సృజన్, మీడియా కన్వీనర్ కొత్త ప్రకాశ్, న్యాయవాది తునికి పవన్ కుమార్, గౌతమ్, జేరిపోతుల మహేందర్, మురళి మనోహర్, తాండ్ర భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పందిళ్ళపల్లి మత్స్య సహకార సొసైటీ అక్రమాలను అరికట్టాలి

- సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు, కమిటీని రద్దు చేయాలి
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేస్తున్న మత్స్య శాఖ ఏడి
- విలేకరుల సమావేశంలో బాధితులు




**ఖమ్మం, మే 16(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్ళపల్లి (పెద్దచెరువు) మత్స్య సహకార సొసైటీలో గత 12 ఏండ్లుగా జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, వారసత్వ సభ్యత్వం పేరుతో వసూళ్లకు పాల్పడిన సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు, కమిటీని రద్దు చేయాలని బాధితులు సింగారపు వీరమల్లు, సింగారపు వీరభద్రం, లింగం సైదులు అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... పందిళ్ళపల్లి (పెద్దచెరువు) మత్స్య సహకార సొసైటీలో సుమారు 149 మంది సభ్యులు ఉన్నారన్నారు. సొసైటీ అధ్యక్ష కార్యదర్శులుగా లింగబోయిన వెంకటేశ్వర్లు(బుజ్జి), షేక్ సైజాని, 9 మంది సభ్యులు ఉన్నా రన్నారు. సొసైటీ 149 మంది సభ్యులలో సుమారు 48 మంది తండ్రులు చనిపోతే వారసత్వంగా వారి కొడుకులకు సభ్యత్వం పేరుతో రూ. 6వేల నుండి ఎక్కువ మొత్తంలో వసూలు చేసి సభ్యత్వం ఇవ్వకుండా మత్స్య శాఖ ఏడికి ఇతరులకు ఇచ్చామని 12 ఏళ్లుగా కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి విషయమై మత్స్య శాఖ ఏడికి మూడుసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. గ్రీవెన్స్ లో కలెక్టర్కు ఫిర్యాదు చేశామని, కలెక్టర్ ఆదేశాలు కూడా మత్స్యశాఖ ఏడి బేఖాతర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారసత్వ సభ్యత్వం పేరుతో నాలుగైదు లక్షలు, అదేవిధంగా కొత్త సభ్యుల పేరుతో 50 మంది దగ్గర రూ.50 వేల రూపాయలను పందిళ్ళపల్లి మత్స్య శాఖ సహకార సొసైటీ, మత్స్యశాఖ ఏడి సహకారంతోనే ఈ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపిం చారు. గతంలో అక్రమాలకు పాల్పడిన ఏడి సస్పెండ్ అయిన అధికారులకు బుద్ధి రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు.

## యువత మత్తుకు దూరంగా ఉండాలి...

- క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి...



**తిమ్మాపూర్,16(పీసీడబ్ల్యూన్యూస్):** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను యువత దూరంగా ఉండాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. “మత్తు వదలరా మిత్రమా” అనే శీర్షికతో యువతకు మత్తు పదార్థాల దుర్వినియోగం పై అవగాహన కల్పించే ఉద్దేశంతో యువజన కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ను శుక్రవారం ఎల్ఎండి కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, మత్తుపదార్థాలను వాడకం వల్ల బంగారు భవిష్యత్తును కొందరు యువకులు నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తును తీర్చుదిద్దుకోవడం మన చేతుల్లోనే ఉంటుందని, ఇప్పటికైనా యువత మత్తు పదార్థాల జోలికి వెళ్ళకుండా సన్మార్గం ఎంచుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని, తద్వారా తల్లిదండ్రుల కోరికలను సాకారం చేసిన వారవుతారన్నారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన గుర్తు చేశారు. క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని, క్రీడలు దేహ దారుఢ్యానికి మానసిక దృఢత్వం పెరుగుతుందన్నారు. క్రీడా స్ఫూర్తిని కలిగింపజేయడమే కాకుండా క్రమశిక్షణ, నియమశీలత వంటి మంచి లక్షణాలను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగంపై సమాజంలో అవగాహన పెంచడమే కాకుండా యువతను క్రీడల వైపు ఆకర్షించాలనే లక్ష్యంతో ఈ టోర్నమెంట్ నిర్వహణకు పూనుకోవడంపై ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ నిర్వాహకులను అభినందించారు. టోర్నీ నిర్వాహకులు యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం వాసు మాట్లాడుతూ మొదటి బహుమతి గా 33,333 రూ.లు, రెండవ బహుమతి గా 22,222 రూపాయలు నగదు అందజేస్తామన్నారు. మానకొండూర్ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ టోర్నమెంట్ ను ఈనెల 20న ఎల్ ఎం డి లోని జిల్లా పరిషత్ స్కూల్ గ్రౌండ్ లో ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీకాంత్, మానకొండూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తొర్తి అరవింద్, ఎల్లపల్లి సిద్ధార్థ్, మానకొండూర్ మండల ఉపాధ్యక్షుడు ముక్కెర సతీష్ పాల్గొన్నారు.

## గులాం అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపిన తబ్లీగ్ జమాత్ ప్రతినిధులు




**కరీంనగర్, మే 16(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ను, కరీంనగర్ మర్కజ్ తబ్లీగ్ జమాత్ ప్రతినిధులు ఎంఐఎం పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత వారం జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణమునకు కరీంనగర్, గుంటూరు పల్లి మస్జిద్ నుంచి స్టూడెంట్ జమాత్ వెళ్ళింది. జమాత్ లో వెళ్లిన చిన్నారులు ఎస్సారెస్పీ కాల్వ వద్ద గల రైల్వే ట్రాక్ పై, చిన్న కంకర రాళ్లతో సరదాగా వరద కాలువలో విసిరేస్తుండగా, అంతలోనే ట్రైన్ వచ్చింది. ట్రైన్ రాకను గమనించిన చిన్నారులు ట్రాక్ పై పెట్టిన రెండు, మూడు రాళ్లను అలానే వదిలి, ట్రాక్ దిగి కిందకు పరిగెత్తారు. ట్రైన్ లోకో పైలెట్ రాళ్లను పెట్టారనే కారణంగా, ట్రాక్ కిందకు దిగిన చిన్నారులను పిలిచి, ఫోటోలు తీసి, కేసు పెట్టిన అంశం ఘటన తెలియగానే, గులాం అహ్మద్ తక్షణమే మెట్ పల్లి వెళ్లి, రైల్వే పోలీసులు, మెట్ పల్లి పోలీసులతో మాట్లాడి, తన పూచీకత్తుపై జమాత్ చిన్నారులను తీసుకొని మరుసటి రోజు కరీంనగర్ రైల్వే స్టేషన్లో గల ఆర్పిఎఫ్, జిఆర్పి పోలీసుల ఎదుట తీసుకెళ్లి, కేసు అంశంపై రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి, బెయిల్ వచ్చేందుకు కృషి చేసినందుకు, గులాం అహ్మద్ కు తబ్లీగ్ జమాత్ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. ఎంఐఎం అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం పార్టీ శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ కోసం, ఎంఐఎం పార్టీ దేశవ్యాప్తంగా విస్తరించాలని ఎంఐఎం ప్రతినిధులు అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, ఇలానే అందరికీ సమాజ సేవ చేసేలా, పీడితుల పక్షాన పోరాడేందుకు అల్లాహ్ మనోధైర్యం కల్పించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తబ్లీగ్ జమాత్ ప్రతినిధులు రహీం మాము, ఆబిద్ హుస్సేన్, దావూద్, రైస్, బషీర్, తౌహీద్, అఫ్జల్, గుంటూరు పల్లి రఫీ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వద్దు:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

- రెండవ రోజు సరస్వతి పుష్కరాల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్
- కాలినడకన తిరుగుతూ భక్తులతో సౌకర్యాల ఏర్పాట్ల పై ఆరా
- భక్తులకు ఇబ్బందులు కలగనివ్వద్దు అని అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 16 (పీసిడబ్ల్యూ న్యూస్):** శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్టాళ్ళు , టెంట్ సిట, సరస్వతి ఘాట్ వద్ద భక్తులను పుష్కర ఏర్పాట్లు, సౌకర్యాలు, మరుగుదొడ్లు, షవర్స్, ఘాట్స్, చలి వేంద్రం పరిశీలించారు.ఈ సందర్భంగా స్టాళ్లు జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఖైదీలు తయారు చేసిన హ్యాండ్ మేడ్ వస్తువుల స్టాల్ జైళ్ల శాఖ డిఐజి సౌమ్య మిశ్రాతో కలిసి ప్రారంభించారు. వివిధ స్టాళ్లు పరిశీలించి వ్యాపారాలు గురించి అడిగి తెలుసుకున్నారు. చలి వేంద్రాలలో మంచినీటి సరఫరాను పరిశీలించారు. త్రివేణి సంగమం వద్ద భక్తులకు మంచినీటి సరఫరాకు చలి వేంద్రం ఏర్పాటు చేయాలని తక్షణమే వాకిటాకీ ద్వారా ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఈ ని ఆదేశించారు. భక్తులతో మంచినీరు అందుతున్నదా? మరుగుదొడ్లు, స్నానాల షవర్స్ ఎలా





ఉన్నాయంటూ భక్తులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భక్తుల అభిప్రాయాలను తెలుసుకొని అధికారులకు తగిన సూచనలు చేశారు. త్రివేణి సంగమంలో భక్తులు స్నానాలకు వెళ్ళడానికి వెళ్ళు మార్గంలో పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని దాని వల్ల భక్తులు వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారని భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మార్గంలో ఎలాంటి పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వహించొద్దని సూచించారు. పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వాహణకు కేటాయించిన ప్రాంతంలో మాత్రమే పిండ ప్రదానాలు నిర్వహించాలని సూచించా రు. వ్యర్థాలు గ్రామ పంచాయతి ఏర్పాటు చేసిన డస్ట్ బిన్స్ లో వేయాలని, త్రివేణి సంగమంలో వేయొద్దని, భక్తులు నది పవిత్రను కాపాడాలని సూచించారు.అనతరం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాల్ లో భక్తులతో ఫోటో దిగారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పరిశ్రమల శాఖ జిఎం సిద్ధార్థ, డిఆర్డిఓ నరేష్, డిటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి పుష్కర స్నానం ఆచరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**కాళేశ్వరం, మే 16(పిసిడబ్ల్యూ న్యూస్):** సరస్వతి పుష్కరాలు అద్భుతం అనిర్వచనీయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారుశుక్రవారం కాళేశ్వరంలో కుటుంబ సమేతంగా సరస్వతి తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం సరస్వతి పుష్కర స్నానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాలు నిర్వహణ అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా,మే 16 (పి సి డబ్ల్యూ న్యూస్): కాళేశ్వరంలో సరస్వతీ పుష్కర ఏర్పాట్లు అద్భుతంగా, అనిర్వచనీయంగా ఉన్నాయన్నారు.పుష్కర స్నానంతో సకల సౌకర్యాలు, సౌభాగ్యాలు కలుగుతాయని ఏవైనా పొరపాట్లు, తప్పులు జరిగి ఉంటే పుష్కర స్నానంతో అవి పరిసమాప్తం అవుతాయని అన్నారు. కుటుంబంతో కలిసి సరస్వతి పుష్కర స్నానం ఆచరించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని డిప్యూటీ సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు.12 రోజుల పాటు జరగనున్న పుష్కరాలకు ఏర్పాట్లు అద్భుతంగా చేశారని, వేలాదిగా భక్తులు తరలి వస్తున్నారని రానున్న 10 రోజులు చాలా కీలకమని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో ఎక్కడా చిన్న లోపం రాకుండా భక్తులందరికీ సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారని అన్నారు. లక్షలాది మంది భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. భక్తులు సౌకర్యాలు కల్పన కు ఏర్పాటు చేసిన టెంట్ సిటీ అద్భుతంగా ఉందని అభినందించారు. భద్రత, పారిశుద్ధ్యం, స్నానాల ఘాట్ల వద్ద ఏర్పాట్లను అధికారులు నిబద్ధత, నిష్టతో ఏర్పాటు చేశారని వివరించారు. పుష్కర స్నానాలకు ప్రతిరోజు ఒక పీఠాధిపతి వచ్చి స్నానం ఆచరించి ముక్తేశ్వర దర్శనం చేసుకుని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఇదొక గొప్ప సందర్భమని అన్నారు. డిప్యూటీ సీఎం వెంట మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం, భూపాలపల్లి మక్కన్ సింగ్, గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై-9 న జరిగే దేశవ్యాపిత సమ్మెకు మద్దతు

**• ప్రకటించిన ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కన్వీనర్ షేక్ షావలి**

**• ఈనెల 20 న జరగాల్సిన సమ్మె అనివార్యంగా జూలై-9 న చేపట్టాలని జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపును స్వాగతిస్తున్నది**

**హైదరాబాద్, మే16 (పీసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు జూలై-9, 2025 న చేపట్టిన దేశవ్యాపిత సమ్మెకు భారత కార్మిక సంఘాల సమాఖ్యా (ఐ.ఎఫ్.టి.యు- (ఇఫ్టూ)) తన సంపూర్ణ మద్దతును, సంఘీభావాన్ని ప్రకటిస్తున్నదని ఆసంస్థ జాతీయ కన్వీనర్ షేక్ షావలి తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే సమ్మె విజయవంతం కోసం జాతీయ కార్మిక సంఘాలతోపాటు, ఆయా రాష్ట్రాల ప్రాంతీయ సంఘటిత, అసంఘటిత, బహుజన ఉద్యోగ,కార్మిక సంఘాలు తీవ్రంగా కృషి చేశాయని అన్నారు. ఈనెల 20 న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగస్తులు, ఇతర శ్రామిక ప్రజలు, బుద్దిజీవులు ఎక్కడికక్కడ స్వచ్ఛందంగానే సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని వివిధ పోరాటాల రూపంలో మే-5, 2025 నుండి 15 వరకు విస్తృతంగా ప్రచార కార్యమాలు చేపట్టిన విషయం అందరికి తెలిసిన విషయమేనని అన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు మరియు స్వతంత్ర రంగాల సమాఖ్యాలు, సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె అనివార్యంగా ఈ సమ్మెను సమ్మె ను జూలై-9 కి వాయిదా వేయడాన్ని తమ సంస్థ స్వాగతిస్తుందని వెల్లడించారు. తిరిగి కార్మిక వర్గం మరింత సంఘటితంగా తమ సమస్యల పరిష్కారం కొరకు జూలై-9 న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఈసందర్భంగా గుర్తుచేశారు. గత 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశం అని చెప్పుకొంటున్న దళారీ దోపిడి పాలవర్గాలకు భారత రాజ్యాంగం ఒక జపమాలగా మారిందని మండిపడ్డారు. చట్టబద్దంగా ఎన్నికైన ప్రభుత్వాలు రాజ్యాంగ బద్దంగా ప్రజల అవసరాలు, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చట్టాలు చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. 1991 లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో అమలుచేసిన నూతన ఆర్థిక, పారిశ్రామిక, ప్రపంచీకరణ, ప్రవేటీకరణ విధానాలు దేశాన్ని, దేశ ప్రజలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేశారని తెలియజేశారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపి ప్రభుత్వం అవేవిధానాలను దూకుడుగా అమలు చేస్తూనే కాషాయికరణతో దేశ ప్రజల మధ్య విచ్చిన్న రాజకీయాలకు పాల్పడిందని అన్నారు. తద్వారా దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసి, ఆర్థిక, రాజకీయ సంక్షోభానికి కారణం అయ్యిందని, నేడు దేశ ప్రజలు అప్పులు, ఆత్మహత్యలు, అర్థాకలి, పస్తులతో తల్లడిల్లుతున్నారని అన్నారు. సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్ పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం, పౌర ప్రజాస్వామిక హక్కులతో పాటు పోరాడి సాదించుకున్న అనేక కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాది చట్టాలను కాలరాచారని ఆరోపించారు. నిరుద్యోగం, దారిద్ర్యం, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు అల్లాడిపోతున్నారని గుర్తుచేశారు. వ్యవసాయ, కార్మిక వ్యతిరేక చట్టాల వలన నేడు అన్నిరంగాలు ఎన్నడులేని విధంగా తీవ్ర సంక్షోభానికి గురైయ్యాయని, వీటి నుండి ప్రజల దృష్టిని మళ్ళించెందుకు మెజారిటీ హిందుత్వవాద మతతత్వ రాజకీయ విధానాలతో అభివృద్ధి అంటే రామనామ జపమే అనే ధోరణిని పెంచి, ఇతర మైనారిటీలపై విద్వేషపూరితమైన ఘర్షణలు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలకు ఉసిగొల్పడమేగాక పహల్గాం దాడికి ప్రతికారంగా పాకిస్థాన్ పై యుద్ధాన్ని ప్రకటించడం సరైన చర్య కాదని, శాంతి పరమైన దౌత్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఎందరో మేదావులు, బుద్ధిజీవులు సూచిస్తున్నప్పటికి, వాటిని పట్టించుకోకుండా రెండు దేశాల ప్రజల మధ్య ఉద్రిక్తలకు కారణం అయ్యి, అమెరికా చెప్పిన వెంటనే కాల్పుల విరమణ ప్రకటించడం లాంటి చర్యలు భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువలకే మాయని మచ్చగా అభివర్ణించారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం అమెరికాతోపాటు ఇతర సామ్రాజ్యవాద ప్రయోజనాల దోపిడీకి అనుకూలంగా దేశాన్ని తాకట్టుపెట్టే అన్నిరకాల అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక చట్టాలను రద్దుచేసి, ఆపరేషన్ కగార్ ను వెంటనే ఎత్తివేయాలని, అడవిని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న ఆదివాసి ప్రజల జీవన మనుగడను దృష్టిలో పెట్టుకొని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపి, జాతీయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్న ప్రజాస్వామిక, న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు.



# భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర జవానులకు వందనాలు...

**• 19న జరిగే తిరంగా యాత్రను విజయవంతం చేయండి...**

**• బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి...**



**కరీంనగర్,మే16(పీసీడబ్ల్యూ న్యూస్):** ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా వీర జవాన్లకు వందనాలు తెలుపుతూ, భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన అన్ని రక్షణ వ్యవస్థలను అభినందిస్తూ దేశ వ్యాప్తంగా తిరంగా యాత్రలు నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ నిర్ణయించిందని, ఈ మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 19వ తేదీ సోమవారం రోజున కరీంనగర్ లోని తెలంగాణచౌక్ చౌరస్తా నుండి టవర్ సర్కిల్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఇట్టి కార్యక్రమంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొంటారని, ప్రోగ్రాంను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.మే19 సాయంత్రం 5 గంటలకు తెలంగాణ చౌక్ నుంచి తిరంగా యాత్ర ప్రారంభమవుతుందనీ, బిజెపి శ్రేణులు అందరూ ఈ ప్రోగ్రాం లో పాల్గొని కార్యక్రమాన్ని సక్సెస్ చేయడానికి తగిన కృషి చేయాలన్నారు.మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారతదేశం విశ్వగురు స్థాయికి ఎదిగిందని, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే ధైర్యం భారతదేశానికి ఉందనే విషయం ప్రపంచానికి మొత్తం అర్థమైందన్నారు.ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైన్యం చేపట్టిన చర్యలకు దేశ ప్రజలు పూర్తిస్థాయి మద్దతు తెలిపారని, 26 నిమిషాల్లో పాకిస్థాన్ లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన ఘనత భారత సైన్యానికి దక్కుతుందన్నారు.పాకిస్థాన్ తుప్పు పట్టిన చైనా ఆయుధాలు, పనికిరాని టర్కీ డ్రోన్లతోఅల్లకల్లోలం సృష్టించాలనుకుందనీ, అయితే భారత సైన్యం స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన రక్షణ వ్యవస్థలతో అద్భుతమైన విజయం సాధించిందని తెలిపారు.చివరికి పాకిస్థాన్ అమెరికా ద్వారా శరణు వేడేలా భారత ప్రధానమంత్రి తో బ్రతిమిలాడుకునే స్థాయికి దిగజారిందన్నారు.భారత సైనికులు స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసుకున్న క్షిపణి వ్యవస్థ, ఆయుధాలతో పాకిస్థాన్ కు నిద్రలేని కాలరాత్రులుగడిపేలాచేశారని, రానున్న కాలంలో పాకిస్థాన్ ఎటువంటి కవ్వింపు చర్యలకు, దురాగతాలకు పాల్పడినా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భారత ప్రధాని ధీటుగా బదులిచ్చారన్నారు.ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పోరాడి అమరులైన వీర జవాన్లకు, వీరోచిత పోరాటం చేస్తున్న భారత సైనికులకు వందనాలు తెలియజేస్తున్నామన్నారు. జిల్లా , మండల, అసెంబ్లీ కేంద్రాల్లో తిరంగా యాత్ర కార్యక్రమాలు పార్టీ ఆధ్వర్యం లో జరుగుతాయని తెలిపారు. ప్రజలందరూ తిరంగా యాత్రలో పాల్గొని, భారత సైనికులకు వందనాలు తెలియజేయాలని, మోదీ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని, ఉగ్రవాద నిర్మూలనకు సంకల్పబద్ధంగా శపథం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను రద్దు చేసి ఇండ్ల ఎంపిక బాధ్యతను అధికారులకు అప్పగించాలి...

**• ఇండ్ల కేటాయింపులో అధికారపార్టీ నాయకుల జోక్యాన్ని నివారించాలి**

**• సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య**



**బయ్యారం,మే 16(పిసిడబ్ల్యూ న్యూస్):** పదేళ్ళ బిఆర్ఎస్ పాలన అవినీతి అక్రమాలతో సాగిందని,తాము అధికారంలోకి వస్తే పారదర్శకమైన ప్రజాపాలన అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి గత ప్రభుత్వాలను తలదన్నే విధంగా ఏక పక్షంగా వ్యవహరిస్తున్నదని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు.. పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ స్వంత పథకంగా మార్చివేసిందని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను వేసి ఎలాంటి ప్రమాణాలు, పద్ధతులు పాటించకుండా ఇష్టారాజ్యంగా ఇండ్ల కేటాయింపులు చేస్తున్నారని, సమగ్ర ఇటింటి కుటుంబ సర్వే చేసి ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన వారి పేర్లను పంచాయతీ గ్రామ సభలలో చదివి ఆ లిస్టులను ఆన్లైన్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సర్వే ప్రకారం నిరు పేదలైన వారికి ప్రాధాన్యతా క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను కేటాయించకుండా గుట్టు చప్పుడు కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో పేర్లు రాయించుకొని ఎమ్మెల్యే, ఇన్ చార్జ్ మంత్రుల సిఫారసులతో లిస్టు ఫైనల్ చేస్తున్నారని విమర్శించారు. న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం బయ్యారం మండల కేంద్రంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎమ్మార్వో,ఎంపీడీవో కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ ఇప్పటికే నియోజక వర్గానికి 3500 ఇండ్ల చొప్పున లబ్దిదారుల లిస్టు ఫైనల్ అయిందని, 2వ, 3వ దశ లిస్టులు కూడా ఫైనల్ అవుతున్నాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించాడని,ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో భారీగా అవినీతి,పక్షపాతం చోటు చేసుకొంటున్నాయని అన్నారు.గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లను ఎమ్మెల్యేల ద్వారా కేటాయింపులు చేయటంపై పెద్ద ఎత్తున విమర్శలు, వ్యతిరేక రావటం, కోర్టులు కూడా జోక్యం చేసుకోవటంతో వెనక్కి తగ్గి లాటరీ పద్దతిలో ఇండ్లను ఎంపిక చేసే విధంగాజీవో నెంబర్ 12ను తీసుకొచ్చిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఆ పద్దతిని కూడా పాటించకుండా ఇష్టానుసారంగా, ఏకపక్షంగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుకు జరుపుతున్నారని ఆరోపించారు.పార్టీ జిల్లా నాయకులు మోకాళ్ళ మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు బండారి ఐలయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో ప్రజాప్రతినిధుల, అధికార పార్టీ నేతల జోక్యాన్ని నివారించాలని, రేవంత రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ప్రాతిపదికగా నిరుపేదలకు ప్రాధాన్యతా క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను గ్రామసభల ఆమోదం తో కేటాయించాలని డిమాండ్ చేశారు.ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను రద్దు చేసి ఇండ్ల ఎంపిక బాధ్యతను అధికారులకు అప్పగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాదంశెట్టి నాగేశ్వరరావు,తుడుం వీరభద్రం,నేతకాని రాకేశ్,రామగిరి బిక్షం,ఏపూరి వీరభద్రం, యాకన్న,తోకల వెంకన్న,పూనెం బిక్షం,చింతా వెంకన్న, రామచంద్రుల మురళీ,గుండెబోయిన లింగమల్లు,మెంగు భగవాన్, కొదుమూరి నాగేశ్వరరావు,తేజావత్ శోభన్,భూక్యా రాము, మేకపోతుల నాగేశ్వరరావు,పాయం సమ్మయ్య,గంగారపు బిక్షం, బొల్లం సోమక్క,గండెల పూనేశ్,యాకూబ్ పాష,మేరుగుమల్ల శంకర్, చల్లా క్రిష్ణ,బానోత్ హెూలీ,అవిరె నారాయణ పాల్గొన్నారు.

## హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయండి



**సుల్తానాబాద్ మే16(పీసీడబ్ల్యూ న్యూస్):** శ్రీమహావీర హనుమాన్ పెద్దజయంతి సందర్భముగా సుల్తానాబాద్ మున్సిపాలిటిలో హనుమాన్ మాల ధరించిన అంజన్న దీక్ష పరులు అందరూ కలిసి స్వచ్ఛందముగా వారి స్వంత ఖర్చులతో సుల్తానాబాద్ మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న శ్రీమహావీర్ హనుమాన్ శోభాయాత్ర తేదీ:18-05-2025 ఆదివారం సాయంత్రం 5 గం.లకు సుల్తానాబాద్ హనుమాన్ భక్త బృందం అధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర కలదు. ఈయొక్క హనుమాన్ శోభయాత్ర పాతవాడ శివాలయం నుండి ప్రారంభము అయి సుల్తానాబాద్ పురవీదుల్లో తిరుగును. శ్రీమహావీర్ హనుమాన్ శోభాయాత్రలో రథం పైన హనుమాన్ ఉత్సవ మూర్తి విగ్రహంతో, మంగళ హారతులతో, అధిక సంఖ్యలో కాగడాలతో, డీజే చప్పుళ్లతో, హనుమాన్ కాషాయ జెండాలతో, ఘనంగా శోభాయాత్ర నిర్వహించడము జరుగుతుంది. కావున హనుమాన్ శోభాయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు, హిందూ బంధువులు, మహిళల సోదరీమణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని హనుమాన్ భగవంతుని దీవెనలు పొందాలని శ్రీహనుమాన్ భక్త బృందం సుల్తానాబాద్ మున్సిపాలిటీ కోరుతున్నది.

## పుష్కరాలకు పెద్ద సంఖ్యలో పోటెత్తుతున్న భక్తులు

**- అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులకు జిల్లా కలెక్టర్ సూచన**



**కాళేశ్వరం :మే16(పీసీడబ్ల్యూ న్యూస్):** సరస్వతి పుష్కరాల సందర్భంగా శుక్రవారం ఘాట్లు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుండే భక్తులు పెద్ద సంఖ్యలో పుష్కర స్నానాలకు సరస్వతి ఘాట్ చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించారు. పుష్కర స్నానానికి ఎంతో పవిత్రత కలిగిన ఈ సందర్భాన్ని భక్తులు ఆధ్యాత్మికంగా జరుపుకున్నారు.భక్తుల రాకతో ఘాట్ల వద్ద ఆధ్యాత్మిక చైతన్యం కనిపించింది. అధికారులు భక్తులకు మార్గనిర్దేశనం చేస్తూ, పుష్కర స్నానంతో పాటు భక్తులు నదీ తీరాల్లో హారతులు సమర్పిస్తూ, దానం చేస్తూ తమ ఆధ్యాత్మికతను చాటుకున్నారు. పుష్కరాల వేడుకలు ఇంకా 10 రోజులు కొనసాగనున్న సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సహాయం



**మహదేవపూర్ : మే16(పీసీడబ్ల్యూ న్యూస్):** మండలం పలుగుల గ్రామంలో పిట్టల రాజు వారి అత్తమ్మ ఎర్ర లచ్చక్క చనిపోయిన విషయంపై ఈరోజు పెద్ద కర్మ సందర్భంగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పలుగుల గ్రామ శాఖ అధ్యక్షులు మానేం మహేష్ ఆధ్వర్యంలో పిట్టల రాజు వాళ్ళ కుటుంబాన్ని పరమర్శించి 5000/- రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది వారి వెంట సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఒద్ది చంద్రయ్య, మచ్చ కిష్టయ్య, మచ్చ వెంకటేష్, సింగల్ విండో డైరెక్టర్ వడ్లకొండ సమ్మయ్య, ఎస్ సి సెల్ ఉపాధ్యక్షులు గారే శంకర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## డిప్యూటీ సీఎంకు యూత్ కాంగ్రెస్ ఘన స్వాగతం



**భూపాలపల్లి జిల్లా,మే 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు విచ్చేస్తున్న ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాబు, యూత్ కాంగ్రెస్ నాయకులు మాటేవాడ సురేష్, అనుఫ్, అఖిల్, సాయి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి పుష్కరాలకి కుటుంబ సమేతంగా డిప్యూటీ సీఎం



**కాళేశ్వరం : మే 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో కుటుంబ సభ్యులతో పుష్కర స్నానం ఆచరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు దంపతులు. ఈ సందర్భంగా నదీమతల్లికి సారె చీర సమర్పించారు.

## వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు

**మహా ముత్తారం,మే 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహా ముత్తారం మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన హట్కర్ పావని బాలాజీ గార్ల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మహా ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సుజాత. ఈ కార్యక్రమంలో వారితో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయంనిధి చెక్కులను అందజేసిన మాజీ ఎంపీపీ

**గట్టు మే 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ఈ రోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో గట్టు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గద్వాల పద్మావతి గద్వాల వెంకటేష్ చికిత్స నిమిత్తం 23,500 రూపాయలు చెక్కును చంద్రశేఖర్ నర్సింహులు కు చికిత్స నిమిత్తం 16,000 రూపాయలు చెక్కును. జగదీష్ తిమ్మప్పకు చికిత్స నిమిత్తం16,000 రూపాయలు చెక్కును. కమ్మరి లక్ష్మి లీలావతి కమ్మరి నాగరాజు కు చికిత్స నిమిత్తం16,000 రూపాయలు చెక్కును. జయమ్మ చిన్న నర్సింహులుకు చికిత్స నిమిత్తం9,500 రూపాయలు చెక్కును.నాయకులు గద్వాల తిమ్మప్ప, నాగరాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# సామాజిక వర్గాలకు విద్య , ఉద్యోగ, ఆరోగ్య ,ఆర్థిక సంక్షేమ, ఉపాధి ,రాజకీయ అవకాశాలు కల్పించాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన ప్రభుత్వానికి విజ్ఞప్తి
- తెలంగాణ ఆరెకటిక సంఘం నేత రావుల కార్ వెంకట్ (ఆర్కే)డిమాండ్



**హనుమకొండ, మే 16(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల కరీంనగర్ లో జరిగిన ఆరెకటికల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక సంఘం ఉపాధ్యక్షుడు రావులకార్ వెంకట్ (ఆర్కే) ప్రముఖ ఇంగ్లీష్ దినపత్రిక సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారిన కూడా ఏడు దశాబ్దాలుగా ఆరెకటికలకు అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సంక్షేమ,రాజకీయ లబ్ధి చేకూరలేదని, తెలంగాణ రాష్ట్రం సిద్ధించినంక కూడా ఎలాంటి సంక్షేమ పథకాలు తమ సామాజిక వర్గానికి అందలేదని ఆవేదన చేశారు .నేడు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలోనూ, శాసనమండలిలోనూ, పార్లమెంట్లలోనూ కూడా తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన అరె కటిక సామాజిక వర్గానికి చెందిన సభ్యుడు లేదని తన మనోగతాన్ని వ్యక్తం చేశారు. 70 సంవత్సరాల కాలం నుండి ఏలిన నేటి ప్రభుత్వం వరకు ఆరెకటిక సామాజిక వర్గానికి అన్ని అన్యాయాలే జరిగాయన్నారు. ఇవి ప్రభుత్వ వైఫల్యాలే అని ఆయన దుయ్యబట్టారు. గత ప్రభుత్వము 10 సంవత్సరాలు ఏలిన,నేటి రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వాలు యొక్క వైఫల్యమే అని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. 2026 పార్లమెంటు నియోజకవర్గాల చట్టం పునర్విభజనలో భాగంగా 119 నుండి 143 శాసన సభ్యుల స్థానాలు పెరిగే అవకాశం ఉంది.తధానుగుణంగా పార్లమెంటు సభ్యుల యొక్క సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది కాబట్టి జనాభా ప్రతిపాదక కాకుండా ఆరెకటికలకు కూడా అసెంబ్లీ లోను, శాసనమండలిలోనూ , టీచర్స్ ఎమ్మెల్సీ లలో ,పార్లమెంటు లోను తమ అరె కటిక సమాజానికి చెందిన సభ్యులకు అవకాశం ఇవ్వాలని కేంద్ర ,రాష్ట్రప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరెకటికలుగా మేము కమ్యూనిటీ పరంగా ఎన్నో బాధలను అవమానాలను వృత్తిపరంగా అనుభవిస్తున్నామని, మా సామాజిక వర్గం ఈశాన్య 12 రాష్ట్రాలలో ఎస్సి ఉపకులాలుగా ఉన్నాయని తెలియజేశారు . ప్రస్తుతము ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వంలో కొనసాగుతున్న వీరేంద్ర కుమార్ కటిక్ కూడా ఆరెకటిక సామాజిక వర్గానికి చెంది మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన తికంఘర్ ఎంపీ స్థానానికి దళిత సామాజిక వర్గానికి చెందిన వారే అవడం మేము గర్విస్తున్నామని ఆర్కే వెంకట్ అన్నారు . ప్రస్తుతం వీరేంద్ర కుమార్ సోషల్ జస్టిస్ మినిస్టర్ గా వ్యవహరిస్తున్నారని తెలియజేశారు .గత ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాలకు అన్ని రాజకీయ లబ్ధి పొందనప్పటికీ నేటి ప్రభుత్వం కూడా అదే ధోరణిలో వ్యవహరిస్తున్నదని నామినేటెడ్ పోస్టుల విషయంలోగానీ ,అసెంబ్లీ స్థానాల కేటాయింపులుగాని,శాసనమండలిలో కానీ ,శాసనసభలో కానీ తమ ఆరెకటిక సామాజిక వర్గము కుల వ్యవక్షేతకు అంటరానితనంగా వ్యవహరించడం జరుగుతున్నదని ధ్వజమెత్తారు. అన్ని సామాజిక వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆరెకటిక సామాజిక వర్గానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలందరూ ఇట్టి అంశంపై ముక్కున వేలేసుకుంటున్నారన్నారు.ఏడు దశాబ్దాల కాలము నుండి తెలంగాణ రాష్ట్ర శాసనసభలలో శాసనమండలిలో పార్లమెంటులో గౌడ,రజక,పద్మశాలి,వడ్రంగి, ముదిరాజ్ యాదవ, కాపు,ఎస్సీ ,ఎస్టీ , క్రిస్టియన్, బ్రాహ్మణ, వెలమ,రెడ్డి వంటి సామాజిక వర్గాల మాత్రమే రాజకీయ లబ్ధి పునరావృతం అవుతుంది కానీ తమ ఆరకటిక సమాజానికి నేటికీ ఎలాంటి అభివృద్ధి ఫలాలు దక్కకపోవడమే కాకుండా రాజకీయంగా తాము ఎదగలేక, చీకటి బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నామని, రోడ్ల పైన మురికివాడల్లో మటన్ కొట్టి అమ్ముకుంటూ తీవ్రమైన అనారోగ్య పరిస్థితులకు గురై రక్తపు మడుగులోరక్త మాంసాలు అమ్ముకుంటున్నటువంటి మా వివక్షత జాతులను అభివృద్ధి బాటలో తీసుకోరావకపోవడం అనేది పాలకుల నిర్లక్ష్యమే అని తీవ్ర నిరాశను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వం వారికి రావలసినటువంటి నామినేటెడ్ పోస్టుల్లో గాని ,శాసనసభలో గానీ ,శాసనమండలిలో గాని ,పార్లమెంటులో గాని వారికి రాజకీయంగా దక్కాల్సిన వాటా ఇవ్వడమే కాకుండా విద్యా, ఉద్యోగ, వైద్య ,ఆర్థిక, సంక్షేమ పథకాలలో వారి భాగస్వామ్యం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నదని ఆర్కే వెంకట్ వాక్యానించారు.

# మావోయిస్టులతో కేంద్రం వెంటనే చర్చలు జరపాలి



**ఉస్మానియా యూనివర్సిటీ, మే 16 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** మధ్య భారతదేశంలో ఆదివాసులపై జరుగుతున్న దాడిని వ్యతిరేకిస్తూ, శాంతి చర్చలకు సుముఖంగా ఉన్న విప్లవకారులతో కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలను జరపాలని ఉస్మానియా యూనివర్సిటీలో పరిశోధక విద్యార్థులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో " శాంతి చర్చలు – మేధో స్పందన " అనే అంశంపై రౌండ్ టేబులు సమావేశం జరిగింది. ( మావోయిస్ట్) పార్టీ తరపు నుండి శాంతి చర్చల కోసం అనేక ప్రకటనలు విడుదల చేసినా కేంద్ర ప్రభుత్వం చర్చలను వ్యతిరేకిస్తున్న సందర్భంలో సమాజంలో మేధావులు ఏ పాత్ర వహించాలి అని మేధావులు, విద్యార్థి సంఘాలు చర్చించారు. రీసెర్చ్ స్కాలర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆజాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల తరపు నుండి ప్రతినిధులు పాల్గొని వాళ్ళ అభిప్రాయాన్ని తెలియజేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ భారతదేశం శాంతిని కోరుకునే దేశం అన్నారు. మావోయిస్టులు చర్చలకు సానుకూలంగా ఉన్నా ప్రభుత్వం ఇంకా స్పందించకపోవడం సరికాదన్నారు. శాంతి చర్చలకు సానుకూల వాతావరణం ఏర్పడడానికి ముందుగా కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటన చేయాలని తెలియజేసారు. ఆపరేషన్ కగార్ లో చనిపోయేవాళ్ళు ఈ దేశ పౌరులు, ఆదివాసులేనన్నారు. ఏ సమస్య అయినా శాంతితో, చర్చలతోనే ముగుస్తుందన్నారు. ఆపరేషన్ కగార్ రాజ్యాంగ వ్యతిరేకమని, రాజ్యాంగం బద్ధంగా నడుచుకునే ప్రభుత్వాలు దానిని గౌరవించాలి అని తెలిపారు. పీస్ కమిటీ అధ్యక్షులు జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ అని మావోయిస్ట్ లను చంపడానికి వెళ్తున్న పోలీసులు, పారా మిలటరీ బలగాలు రాజ్యాంగాన్ని చదువుకోవాలని అన్నారు. ప్రొఫెసర్ కోదండరాం రాజ్యాంగాన్ని ఉల్లంఘించే హక్కు ఏ ప్రభుత్వానికి లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలన్నారు. భారత్ బచావో నేషనల్ వైస్ చైర్మన్ ఎం. ఎఫ్. గోపినాథ్ మావోయిస్ట్ లు చర్చలు చేస్తాం అని ప్రకటిస్తున్నప్పుడు కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోవడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ వలన ఆదివాసుల హక్కులు ప్రమాదంలో పడ్డాయని చెప్పారు. ప్రజల జీవించే హక్కుపైన కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ రావు, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, భారత బచావో జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ గాదె ఇన్నయ్య పాల్గొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులుగా ఆదివాసి కాంగ్రెస్ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు . బోస్, న్యూ డెమోక్రసీ అధికార ప్రతినిధి చలపతిరావు, మాస్ లైన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్. ఎల్. పద్మ, న్యూ డెమోక్రసీ సెంట్రల్ కమిటీ మెంబర్ బొక్కల భాస్కర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జిలకర శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు భట్టు వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షులు సాగబోయిన పాపారావు, ప్రచార కమిటీ మెంబర్ కోట శ్రీనివాస్, చైర్మన్ విజయ్, ఉస్మానియా న్యాయ విద్యార్థి సంఘం అధ్యక్షులు శ్రీకాంత్, ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, ఉస్మానియా యూనివర్సిటి అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్, అజయ్, రాష్ట్ర అధ్యక్షులు అనిల్, ( విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి ఆలూరి విజయ్, కమిటీ సభ్యులు శివ, అధ్యక్షులు శ్రవణ్, అధ్యక్షులు దివాకర్, గిరిజన శక్తి ఓయు అధ్యక్షులు హనుమంత్ నాయక్, నాయకులు రమేష్, జంగయ్య, రాజేష్ నాయక్, అధ్యక్షులు క్రాంతి కిరణ్, అధ్యక్షులు జాన్, రైతాంగ సమితి అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, అధ్యక్షులు పల్లా రవీంద్ర నాథ్, రాంబాబు, సామాజిక వేత్త నార్ల రవి, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హిందూ సంఘటిత శక్తిని చాటేలా..... దేశద్రోహుల వెన్నులో వణుకు పుట్టేలా...

- "హిందూ ఏక్తా యాత్ర" సంచలనం కాబోతోంది
- యావత్ తెలంగాణకు స్ఫూర్తిగా నిలిచేలా కరీంనగర్ లో 'ఏక్తా యాత్ర' సక్సెస్ చేస్తాం
- ప్రతి ఒక్క హిందువు ఈ యాత్రలో పాల్గొనాలికేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- కరీంనగర్‌లో బీజేపీ శ్రేణులతో 'హిందూ ఏక్తా యాత్ర' సన్నాహక సమావేశం
- లక్ష మందిదాకా యాత్రకు హాజరవుతారని అంచనా
- ఇంటింటికీ వెళ్లి యాత్రకు ఆహ్వానించాలని నాయకులను కోరిన సంజయ్






**కరీంనగర్ టౌన్, మే 16(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లో ఈనెల 22న నిర్వహించబోయే "హిందూ ఏక్తా యాత్ర" తెలంగాణలో ఓ సంచలనం కాబోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. హిందువుల సంఘటిత శక్తి చాటేలా..... దేశద్రోహుల వెన్నులో వణుకు పుట్టేలా.... సంతూష్టీకరణ పేరుతో ఒక వర్గం ఓట్ల కోసం హిందువుల మధ్య విబేధాలు సృష్టిస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే నాయకుల చెంప చెళ్లుమనేలా "హిందూ ఏక్తా యాత్ర"ను కనీవినీ ఎరగని రీతిలో నిర్వహిస్తామన్నారు. "హిందూ ఏక్తా యాత్ర రాజకీయ కార్యక్రమం కానేకాదు. ఇది ఒక పార్టీకి సంబంధించినది కాదు. హిందూ శక్తిని ప్రదర్శించే యాత్ర మాత్రమే. బొట్టు పెట్టుకునే ప్రతి ఒక్కరిదీ"అని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామం నుండి మండల కేంద్రాలదాకా, మున్సిపాలిటీ నుండి కార్పొరేషన్ దాకా గడప గడప నుండి హిందువులంతా యాత్రకు తరలిరావాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులంతా ఇంటింటికీ వెళ్లి ఈనెల 22న కరీంనగర్ లో నిర్వహించబోయే 'హిందూ ఏక్తా యాత్ర'కు తరలిరావాలంటూ ఆహ్వానించాలని కోరారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో ఈరోజు సాయంత్రం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ మండలాల అధ్యక్షులు, ఇంఛార్జీలు, ముఖ్య నాయకులు, మహిళా మోర్చా నాయకులతో 'హిందూ ఏక్తా యాత్ర' సన్నాహక సమావేశం నిర్వహించారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్ సునీల్ రావు, చెన్నమనేని వికాస్ రావు, గుగ్గిళ్ల రమేశ్, ఓదేలు, వాసాల రమేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే.... తెలంగాణ ఉద్యమంతో ప్రత్యేక రాష్ట్రం సిద్దించింది. ఇక మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ తో రాజకీయాలు నడవవు. ఇప్పుడు జాతీయవాదులను, హిందువులందరినీ ఏకం చేయాల్సిన అవసరం వచ్చింది. పెహెల్ గాం ఘటనతో ఏం జరిగిందో అందరం చూసినం. ప్రతి ఒక్క హిందువు ఆ ఘటనను చూసి రగలిపోయారు. ఉగ్రవాదులతోపాటు పాకిస్తాన్ అంతు చూడాలని కోరుకున్నారు. ఆ తరువాత ఏం జరిగిందో మీ అందరికీ తెలుసు. ఇప్పుడు హిందువులందరినీ ఏకం చేయాల్సిన అవసరం ఏర్పడింది. హిందూ ఏక్తా యాత్ర ద్వారా హిందువులందరికీ సంఘటితం చేసే మహత్తర అవకాశం వచ్చింది. ఈనెల 22న కరీంనగర్ లో నిర్వహించబోయే 'హిందూ ఏక్తా యాత్ర' ద్వారా ఈ అవకాశం మనందరికీ వచ్చింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లండి. హిందూ ఏక్తా యాత్రకు ఆహ్వానించండి. అసలు ఏక్తా యాత్ర ఉద్దేశమేమిటి? హిందువులంతా ఐక్యంగా ఉండకపోతే ఏం జరిగే ప్రమాదముందో తెలియజేయాలి. యువతను, మహిళలను, విద్యార్థులను, కుల సంఘాలను, ప్రజా సంఘాలను, వృత్తి సంఘాలను ఏకం చేయాలి. లక్ష మందికి తగ్గకుండా ర్యాలీలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. వరంగల్ లో పుజారిని హత్య చేస్తే హిందువులందరినీ ఏకం చేయడం ద్వారా ఆ తరువాత జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఏకంగా 14 కార్పొరేటర్ స్థానాలను కైవసం చేసుకున్నాం. కరీంనగర్ లోనూ సత్తా చాటాం. మీ అందరికీ ఈ యాత్ర పేరుతో ప్రతి ఒక్కరినీ కలుసుకునే అవకాశం వచ్చింది. మీ నాయకత్వాన్ని ప్రూవ్ చేసుకునే సమయం వచ్చింది.ఇకపై కరీంనగర్ లో ఏ ఒక్క గల్లీ చూసినా కాషాయ జెండాలే కన్పించాలి. సర్పంచ్, ఎంపీటీసీ, కార్పొరేటర్ గెలవాలంటే కాషాయ జెండా పట్టాల్సిందే. కరీంనగర్ లో ఇప్పటికే కాషాయ వాతావరణం నెలకొంది. మనం చేయాల్సిందల్లా హిందువుల ఐక్యతను చాటి చెప్పడమే. హిందూ ఏక్తా యాత్ర పేరుతో అందివచ్చిన ఈ అవకాశాన్ని మీరంతా ఉపయోగించుకోవాలని, హిందువులందరినీ సంఘటితం చేయాలని కోరుతున్న అన్నారు.

# అకాల వర్షాలతో కుదేలు



ఏ ప్రభుత్వం వచ్చినా అన్నదాతలను ఆదుకోవడం లేదన్నది అర్థం అయ్యింది. అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు లబోదిబోమంటున్నా అధికారులు మాత్రం రైతుల వద్దకు వెళ్లడం లేదు. మార్కెట్ కమిటీలు ఉన్నా ఉత్తిదే అని తేలింది. మంత్రులు ప్రకటనలకే పరిమితం అయ్యారు. ఇటీవల ధాన్యం అకాల వర్షాలకు పూర్తిగా తడిసిపోయింది. అలాగే ధాన్యం కొనుగోళ్లు చురుకుగా సాగడం లేదు. గత ప్రభుత్వం ప్రచారార్భాటం చేసిందే తప్ప కొనుగోళ్లపై చిత్తశుద్ధి ప్రకటించలేదు. ఇప్పుడేమో ధర్నాలు, ఆందోళనలకు బిఆర్ఎస్ పిలుపునివ్వడం సిగ్గుచేటు. ఇకపోతే కాంగ్రెస్ కూడా అదే దారిలో నాడుస్తోంది. క్షేత్రస్థాయిలో మార్కెటింగ్ సిబ్బందిని పంపి ధాన్యం మొత్తాన్ని కొనేలా ప్రణాళికలు సిద్ధం చేయలేదు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడం అన్నదాతలకు కష్టంగా మారింది. ఇప్పటికే ధరల హెచ్చు తగ్గులతో తీవ్రంగా నష్టపోతుండగా, పంటను అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. వరి, వేరుశనగ, జొన్న,మక్క జొన్న ఇలా పంట ఏదైనా కొనుగోళ్లు సక్రమంగా లేవు. మిల్లుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో రైతులు ఆందోళనకు దిగుతున్నారు. కొన్నిచోట్ల రైతులు మార్కెట్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు ఫిర్యాదు చేయగా వ్యాపారులను అడగాలని సూచించారు. రైతులు మిల్లుల వద్దకు వెళ్లి కొనుగోలు చేయాలని కోరగా కొందరు నిరాకరించారు. ఓ వైపు మబ్బులు కమ్ముకొస్తున్న వేళ ఉదయం నుంచి సాయంత్రం వరకు చూసి ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో చేసేదేమీ లేక జిల్లాల్లో వేరుశనగ రైతులు మళ్లీ బస్తాల్లో నింపుకొని ఇళ్లకు తీసుకెళ్లారు. పంట పండించడం ఒక ఎత్తయితే పంట అమ్ముకోవడం మరో ఎత్తవుతున్నది. మార్కెట్‌లో వేరుశనగను ఎవరూ ఖరీదు చేయకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. మిల్లుల వద్దకు వెళ్లి అడిగితే తక్కువ ధరకు కొంటామంటున్నరు. ఎకరానికి 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావాల్సి ఉండగా, 5 క్వింటాళ్లే వచ్చింది. దిగుబడి తగ్గి నష్టపోగా, ధర లేకపోవడం, వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో సాగుచేయడం భారంగా మారుతోంది. పెట్టిన పెట్టుబడి రాక ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. మద్దతు ధర చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైంది. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో అకాల వర్షానికి వడ్ల బస్తాలు తడిసి ముద్దయ్యాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యం తూకం వేయకుండా, తూకం వేసిన ధాన్యం తరలించకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడుస్తున్నదని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాల సంఖ్య పెంచి లారీల కొరత తీరుస్తామని హామీ ఇవ్వాలని కోరుతున్నారు. తామే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం పది రోజుల నుంచి తూకం చేయడం లేదు. సొసైటీ వాళ్లను అడిగితే రైస్‌మిల్లర్లు వద్దని చెబుతున్నారని సమాధానం ఇస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి మా రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ధాన్యం కొనకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసింది. మొలకలు వస్తున్నాయి. అధికారులు స్పందించి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాల్సి ఉంది. ఇకపోతే ఇటీవల కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది. పలు గ్రామాల రైతులు విక్రయానికి తీసుకొచ్చిన జొన్నలతోపాటు తూకం వేసిన జొన్న బస్తాలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చామని, తూకం వేసిన అనంతరం లారీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని రైతులు తెలిపారు. జొన్న బస్తాలను తరలించేందుకు ఒక్కో బస్తాకి రూ.10-రూ.20 తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రం అంతటా ఇదే దుస్థితి నెలకొంది. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులకు ఊరట కల్పించాల్సి ఉంది. ఇకపోతే గత నాలుగేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతన్నలకు వాతావరణశాఖ శుభవార్త అందజేసింది. ఈ ఏడాది ముందుగానే నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉంది. మే 27ననే నైరుతి రుతుపవనాలు రానున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.. వాతావరణశాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపింది. రుతుపవనాల సీజన్‌లో 106 శాతం వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేసింది. ఆగస్టు-సెప్టెంబరు నాటికి ఎక్కువ వర్షపాతం నమోదు కావచ్చని వెల్లడించింది. వాయవ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. గతేడాది నైరుతి రుతుపవనాలు రాక ఆలస్యం కావడంతోపాటు..దేశంలోనూ వివిధ ప్రాంతాలకు ఆలస్యంగా విస్తరించడంతో తొలకరి జల్లుల కోసం రైతులు కళ్లు కాయలు కాసే వరకు ఎదురు చూశారు. పైగా నైరుతి రుతుపవనాల ప్రభావం కూడా తొలినాళ్లలో పెద్దగా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండుతున్న ఎండాకాలం ప్రజలందరికీ వాతావరణశాఖ చల్లటి కబురు పంపింది. నైరుతి రుతుపవనాలు ఇప్పటికే అండమాన్‌ను తాకాయి. ఇప్పటికే వర్షాలు లేక జలాశయాలన్నీ ఖాళీ అయ్యాయి. రుతుపవనాలు రాకతో విస్తరంగా వర్షాలు కురవనున్నాయి. సరైన సమయంలో రుతుపవనాలు పలకరిస్తే....సకాలంలో పంటలు వేయడం వల్ల ఆ తర్వాత వచ్చే తుపాన్‌లు, వరదల నుంచి పంటను కాపాడుకునే అవకాశం ఉంది. వాతావరణశాఖ తెలిపిన చల్లని కబురుతో రైతుల ముఖంలో వెలుగులు నిండాయి. ఇప్పటికే పంటపొలాలను సిద్ధం చేసుకుని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మనదేశంలో నైరుతి రుతుపవనాల వల్లే విస్తరంగా వర్షాలు కురుస్తాయి. వర్షాధార పంటలకూ ఇవే ఆధారం. దేశంలో జూన్, జులై నెలలో పడే వర్షాలే అత్యంత కీలకం. సాధారణంగా నైరుతి రుతుపవనాలు కొంచెం అటు, ఇటుగా జూన్ తొలివారంలోనే దేశంలోకి ప్రవేశిస్తాయి. గతేడాది జూన్ 8న రాగా...ఈసారి వారం రోజులు ముందుగానే పలకరించనున్నాయి. ఒకసారి కేరళలోకి ప్రవేశించిన తర్వాత వారం పదిరోజుల్లోనే దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. తెలంగాణ ఏపీ భూభాగంపైకి విస్తరించి సమృద్ధిగా వర్షాలు కురిపిస్తాయి. వర్షాధార పంటలపైనే ఆధారపడే తెలుగు రాష్ట్రాల ప్రజలకు నైరుతి రుతుపవనాల రాక ఎంతో కీలకం. అనుకున్న సమయం కన్నా ఆలస్యం కావడం వల్ల తొలినాళ్లలో వర్షాలు లేక ఇబ్బందిపడిన రైతులు... ఆ తర్వాత పంటలు చేతికొచ్చే సమయంలో కుంభవృష్టితో మరోసారి నష్టపోయారు. ఈసారి సకాలంలో వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ కబురుతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.

# బిజెపి అన్ని విధాలుగా బలంగా ఉంది

- ఇండియా బ్లాక్ బలపడితేనే ఎదుర్కొగలం
- మాజీ మంత్రి చిదంబరం వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,మే16:** భారతీయ జనతాపార్టీ అన్ని విధాలుగా బలంగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కొనియాడారు. అదే సమయంలో విపక్ష ఇండియా బ్లాక్ భవిష్యత్తుపై అనుమానం వ్యక్తంచేశారు. కూటమిలో అనిశ్చితి నెలకొన్న విషయం వాస్తవమేనని అంగీకరించారు. అయితే ఇండియా బ్లాక్ బలంగా ఉంటనే బిజెపికి చెక్ పెట్టడం సాధ్యమని అన్నారు. ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో చిదంబరం మాట్లాడుతూ.. ఇండియా బ్లాక్ చెక్కుచెదరకుండా ఉంటే చాలా సంతోషం. కానీ అది బలహీనంగా కనిపిస్తోంది. కానీ అది పుంజుకోవడానికి సమయం ఉంది. అదే భాజపా విషయానికొస్తే.. వ్యవస్థీకృతంగా బలంగా ఉందన్నారు. కాంగ్రెస్ కూటమి బలంగా ఉండాల్సిందేనంటూ..అందులోని పార్టీలో మరింత పారదర్శకంగా నిలబడాల్సి ఉందన్నారు. నా అనుభవం, చరిత్ర చూస్తే.. ప్రతి విభాగంలోనూ పటిష్టంగా ఉన్న భాజపా లాంటి పార్టీ మరొకటి లేదు. ప్రతి వ్యవస్థను నియంత్రించగల, స్వాధీనం చేసుకోగల శక్తి కలిగిఉంది. అలాగే దానిని సవాలు చేయాలంటే.. విపక్ష కూటమి అన్ని విభాగాలను మెరుగుపరచుకోవాలి. ఈ పరిస్థితుల్లో 2029 ఎన్నికలు అత్యంత కీలకమని చిదంబరం అభిప్రాయపడ్డారు. దీనిపై భాజపా స్పందించింది. వరుస ఓటములు కాంగ్రెస్‌ను బాధించాయని ఆ పార్టీ నేత అమిత్ మాలవీయ ఎద్దేవా చేశారు. చిదంబరం అంచనా ప్రకారం.. విపక్ష కూటమిలో అనిశ్చితి ఉంది. భాజపా బలమైన పార్టీ. కాంగ్రెస్‌కు భవిష్యత్తు లేదని రాహుల్ గాంధీ అత్యంత సన్నిహితులకు కూడా తెలుసని మరో నేత ప్రదీప్ బండారీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ ఎప్పటికీ ఇక కోలుకోలేదన్నారు. అది నిలబడడం అన్నది కల్ల అన్నారు.

# కుటుంబ బంధాలకు విలువేదీ?

- పండగల వేళ మాత్రమే ఇది సరికాదు

**విజయవాడ,మే16:** ఏ వ్యక్తికైనా బలం... బలగం... తన కుటుంబం. కుటుంబం అంటే పెద్ద బలగం అని, స్నేహితులు, బంధువుల సమూహం అని అర్థం. ఇటీవల వచ్చిన బలగం సినిమా... కుటుంబ ప్రాధాన్యతని, కుటుంబంలోని వ్యక్తులంతా కలిసివుంటే...అదే బలగం అని చెప్పింది. మనం ఎంతగా కుటుంబానికి కట్టుబడి ఉంటున్నామో ఆలోచించాలి. ఒకరోజు గడిచిపోయింది. ఎక్కడా బంధాలపై పెద్దగా భావనకానరావడం లేదు. కేవలం పండగల సందర్భంలో హడావిడి చేస్తున్నాం. దీనిని అధిగించేందుకు గ్రామాల్లో పునాఇ ఉండాలి. అప్పుడే మన సంసారాలు బాగుడతాయి. నా ఇంటి పేరు ప్రపంచం/ ప్రజలే నా కుటుంబం/ వెదజల్లుతా దిగ్దిగంతం/ అభ్యుదయ సుగంధం అప్పుడు నా జీవితమే ఒక ప్రబంధం' అంటారు సినారె. సంతోషం, బాధ, దుఃఖం, ప్రేమ, అనుబంధాలు, కలహాలు, ఆత్మీయతలు ఇవన్నీ ఒకేచోట కలిసుండేదే



కుటుంబం. భిన్న రకాల మనస్తత్వాలు, అభిప్రాయాలున్న వ్యక్తులను ఒకేచోట అనుబంధంగా మర్చేస్తుంది కుటుంబం. మన భారతీయ కుటుంబం.. అంతులేని శక్తికి, బలానికి సూచికగా నిలుస్తోంది. పిల్లల ఆనందాన్ని తమ సంతోషంగా భావించే తల్లిదండ్రులు, కన్నవారి కలలను సైతం నెరవేర్చాలనే తపన పిల్లలది. ఇలా ఎల్లప్పుడూ ప్రేమ ఆత్మీయతలతో కలిసుండేది ఫ్యామిలీ. ఇక మన భారతీయ సంప్రదాయంలో ఉమ్మడి కుటుంబాలు ప్రత్యేకం. మే 15అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం. మరి ఈరోజును ఎందుకు జరుపుకుంటారు.. 1983లో ఐక్యరాజ్య సమితి చూపు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుటుంబాల వైపు మళ్లింది. ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్, సోషల్ డెవలప్ మెంట్ కమిషన్ అప్పటి సెక్యూరిటీ జనరల్ కుటుంబాల సమస్యలు, వారి అవసరాల గురించి మరింత అవగాహన పెంచుకోవాలను కుంది. మే 29, 1985న ఆమోదించిన తీర్మానంలో కౌన్సిల్ సిఫారసు పై జనరల్ అసెంబ్లీ అభివృద్ధి పక్రియలో కుటుంబాలు అనే అంశాన్ని కూడా చేర్చారు. డిసెంబర్ 1989లో ప్రతి సంవత్సరం మే 15న జరుపుకునే అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ప్రకటించింది. ఉమ్మడి కుటుంబాల్లో వలె కలిసి మెలిసి ఉండే మనసు కానీ, మనుషులు కానీ లేకుండా పోయారు. పెండ్లయిన వెంటనే వేరు కాపురాలు పెట్టుకొని జంటలుగా ఉండి కూడా మొబైల్ ఫోన్ పట్టుకొని ఒంటరైపోతున్నారు. సలహాలిచ్చే పెద్దవారు లేక, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు రాక, బాధలను పంచుకునే బంధువులు లేక ఒంటరిగా మారుతున్నారు. చిన్న సమస్యలకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇక్కడే ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యం తెలిసి వస్తున్నది. కుటుంబ వ్యవస్థతో మన సంస్కృతిని పిల్లలకు అందజేయడం, ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడం చేయాలి. ఇదే మానవీయ సమాజ ఉన్నతికి మూలం...అందుకు ప్రతి ఒక్కరూప్రతిన పూనాలి.

# పాక్‌తో దూరంగా తాలిబన్ ప్రభుత్వం

- జైశంకర్‌తో విదేశాంగ మంత్రి చర్చలు
- కలసివస్తున్న అంతర్జాతీయ పరిణామాలు

**న్యూఢిల్లీ,మే16:** భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తాలిబన్ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే. అయితే, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాక్ సంచలన ఆరోపణలు చేసింది. భారత్ ప్రయోగించిన ఓ క్షిపణి అఫ్గాన్ భూభాగంలో పడినట్లు తప్పుడు ప్రచారం చేసింది. దీన్ని కాబూల్ ఖండించింది. తమకు ఎలాంటి హాని జరగలేదని, అదంతా అవాస్తవమేనని తాలిబన్ రక్షణశాఖ ప్రతినిధి వెల్లడించారు. అటు న్యూదిల్లీ కూడా పాక్ ప్రచారాన్ని తిప్పికొట్టింది. ఈక్రమంలో తాజాగా అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వంలో తాత్కాలిక విదేశాంగ మంత్రిగా ఉన్న ఆమిర్‌ఖాన్ ముత్తాఖీతో.. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఫోన్‌లో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడిని తాలిబన్లు ఖండించడాన్ని జైశంకర్ స్వాగతించారు. ఈవిషయాన్ని కేంద్రమంత్రి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తాలిబన్ ప్రభుత్వంతో న్యూదిల్లీ మంత్రిత్వ స్థాయి చర్చలు జరపడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అఫ్గాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్‌తో మంచి సంభాషణ జరిగింది. పహల్గాం ఉగ్రదాడిని ఆయన ఖండించడం హర్షణీయం. భారత్-అఫ్గానిస్థాన్ మధ్య విభేదాలు సృష్టించేందుకు ఇటీవల అవాస్తవ, నిరాధార ప్రచారం



జరిగింది. దాన్ని ఆయన తోసిపుచ్చడాన్ని స్వాగతిస్తున్నా. అఫ్గాన్ ప్రజలతో మా స్నేహబంధాన్ని కొనసాగిస్తాం. వారి అభివృద్ధికి నిరంతర మద్దతు అందిస్తాం. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశంపై మేం చర్చలు జరిపామని జైశంకర్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 2021 ఆగస్టులో అఫ్గాన్‌లో తాలిబన్ పాలన ఏర్పడిన సంగతి తెలిసిందే. ఆ ప్రభుత్వాన్ని భారత్ అధికారికంగా గుర్తించనప్పటికీ దౌత్య సంబంధాలు మాత్రం కొనసాగిస్తోంది. ఈ ఏడాది జనవరిలో దుబాయ్ వేదికగా ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. మరోవైపు, అఫ్గాన్‌లో అల్‌ఖైదా, ఐసిస్, తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్ వంటి ఉగ్రముఠాల ఉనికిపై న్యూదిల్లీ ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే తాజాగా తాలిబన్ మంత్రితో జైశంకర్ చర్చలు జరపడం తాజా పరిస్థితుల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. పాక్ ఒంటరి అయ్యిందనడానికి ఇది కూడా కీలక పరిణామంగా చూడాలి

## రామాయణంలో మండోదరిగా

# కాజల్ ?



టాలీవుడ్, బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే చాలా రోజుల తర్వాత సత్యభామ అంటూ ఇటీ–వల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకుంది. అయితే ఈ భామ తాజాగా మరో బంఫరాఫర్ కొట్టినట్లు– తెలుస్తుంది. బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం రామాయణలో కాజల్ ఛాన్స్ కొట్టేసినట్లు– తెలుస్తుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమాలో కాజల్ రావణుడి భార్య మండోదరి పాత్రలో కనిపించనున్నారు. నితీష్ తివారి 'రామాయణ' ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినప్పటి నుంచి నటీనటుల ఎంపికపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి ఖరారయ్యారు. ఇప్పుడు మండోదరి పాత్ర కోసం కాజల్ అగర్వాల్‌ను ఎంపిక చేసినట్లు– వార్తలు వస్తున్నాయి. కాజల్ అగర్వాల్ తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలు పోషించారు. ఆమె నటనకు మంచి గుర్తింపు ఉంది. 'మగధీర', 'డార్లింగ్', 'బృందావనం' వంటి తెలుగు చిత్రాలతో పాటు–, 'సింగం', 'స్పెషల్ 26' వంటి హిందీ చిత్రాల్లోనూ ఆమె తన ప్రతిభను చాటు–కున్నారు. ఇప్పుడు 'రామాయణం' వంటి ప్రతిష్టాత్మక చిత్రంలో మండోదరి వంటి బలమైన పాత్రలో ఆమె ఎలా మెప్పిస్తారో చూడాలి. మండోదరి పాత్ర రామాయణంలో ఒక ముఖ్యమైన పాత్ర. రావణుడి పట్టపురాణిగా ఆమె రావణుడికి మంచి సలహాలు ఇస్తూ, ధర్మం వైపు నిలబడే ప్రయత్నం చేస్తుంది. తన భర్త తప్పులను ఎత్తిచూపుతూ, సీతను తిరిగి రాముడికి అప్పగించాలని సూచిస్తుంది. కాబట్టి, ఈ పాత్రకు కాజల్ వంటి అనుభవం ఉన్న నటి అయితే మరింత న్యాయం చేకూరుస్తుందని మేకర్స్ భావిస్తున్నట్లు– సమాచారం. అయితే, ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, కాజల్ అగర్వాల్ కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుంది అనడంలో సందేహం లేదు. నితీష్ తివారి 'రామాయణం' మూడు భాగాలుగా తెరకెక్కనున్నట్లు సమాచారం. ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుంటు–ందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతికతతో ఈ చిత్రం రూపొందనుంది.



# హరిహరవీరమల్లు.. జూన్ 12న విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న భారీ చిత్రం హరి హర వీరమల్లు. ఈ సినిమా విడుదల ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు ఎట్టకేలకు శుభవార్త అందింది. అన్ని అడ్డంకులను దాటుకొని జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుంది. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాకు సంబంధించిన మొత్తం షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ఈ చిత్రం పాన్‌ఇండియా స్థాయిలో విడుదల అవుతుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పెద్దెత్తున విడుదల కానుంది. అమెజాన్ ప్రైమ్ దీని డిజిటల్ రైట్స్‌ను భారీ ధరకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ హరి హర వీరమల్లు సినిమా గత కొన్నేళ్లుగా ఆలస్యమవుతూ వచ్చింది. హీరో పవన్ కళ్యాణ్ రాజకీయాల కారణంగా ఈ సినిమా షూటింగ్ నిరవధికంగా ఆగిపోవడంతో ఆలశ్యం అయ్యింది. కానీ ఎట్టకేలకు పవన్ కళ్యాణ్ సినిమా షూటింగ్ లో పాల్గొని పూర్తి చేశారు. మే 6, 2025న సినిమా చిత్రీకరణ ముగిసినట్లు– నిర్మాతలు ప్రకటించారు. గతంలో ఈ సినిమా మార్చి 28, మే 9 తేదీలలో విడుదల అవుతుందని పలు వార్తలు వచ్చినా.. పలు కారణాల వల్ల వాయిదా పడింది.




# ఎన్టీఆర్ నెగెటివ్ షేడ్‌లో వార్–2

## • 20న టీఈజర్ విడుదలకు సన్నాహాలు

బాలీవుడ్‌లో ఇదివరకు సంచలన విజయం అందుకున్న యాక్షన్ స్పై థ్రిల్లర్ 'వార్'కు సీక్వెల్‌గా రాబోతున్న చిత్రం 'వార్ 2'. 2019లో విడుదలైన మొదటి భాగంలో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ యాక్షన్ సీన్స్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేశారు. ఇప్పుడు ఈ సీక్వెల్‌కి మరింత క్రేజీగా రూపొందించడానికి పాన్ ఇండియా స్టార్ ఎన్టీఆర్ రంగంలోకి దిగాడు. ఇది ఎన్టీఆర్‌కి బాలీవుడ్‌లో తొలి చిత్రం కావడంతోనే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని 'బ్రహ్మాస్త్ర' వంటి విజువల్ వండర్‌ని తెరపైకి తీసుకొచ్చిన అయాన్ ముఖర్జీ డైరెక్ట్ చేస్తున్నారు. యశ్ రాజ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ చిత్రానికి సరికొత్త మేకింగ్ కథాంశం ఉండబోతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్ర ఎలా ఉండబోతుందనేది అభిమానుల్లో పెద్ద క్యూరియాసిటీగా మారింది. కొన్ని లీకుల ప్రకారం, ఆయన నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారని, అయితే అది పూర్తిగా విలన్ కాదని.. గ్రే షేడ్స్ కలిగిన పవర్‌ఫుల్ క్యారెక్టర్ అని సమాచారం. కొత్త లుక్‌లో ఎన్టీఆర్ స్క్రీన్‌పై ఎలా కనిపిస్తాడన్నదే ఇప్పుడు ప్రధాన చర్చాంశం. ఇక ఈ సినిమాకు సంబంధించి టీజర్ విషయానికి వస్తే.. ఎన్టీఆర్ పుట్టినరోజు మే 20 సందర్భంగా చిత్ర యూనిట్ రిలీజ్ చేయాలనే ప్లాన్‌లో ఉంది.

# అమెజాన్ ప్రైమ్‌లో అర్జున్ సన్నాఫ్ వైజయంతి




నటులు కల్యాణ్ రామ్, విజయశాంతి కలిసి నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి చిత్రం తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఏప్రిల్ 18న థియేటర్లలో విడుదలైంది. తల్లి కొడుకుల అనుబంధం, యాక్షన్ ప్రధానంగా సాగిన ఈ సినిమాకు థియేటర్లలో మిశ్రమ స్పందన లభించింది. అయితే ఈ సినిమా ఇటీవల రెంటల్ విధానంలో ప్రముఖ ఓటీటీ– వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలోకి వచ్చిన విషయం తెలిసిందే. రెంటల్ రావడంతో సినిమా చూద్దం అనుకున్న ప్రేక్షకులకు నిరాశ ఎదురైంది. అయితే తాజాగా ఈ సినిమాను రెంటల్ నుంచి తొలగించి ఫ్రీగా అందుబాటులోకి తీసుకోచ్చారు. ప్రైమ్ చందదారులు ఈ సినిమాను ఉచితంగా చూడవచ్చు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. వైజయంతి (విజయశాంతి) అనే నిజాయితీగల ఐపీఎస్ అధికారి చుట్టూ తిరుగుతుంది. ఆమెకు అర్జున్ (కళ్యాణ్ రామ్) అనే ఒకే ఒక్క కొడుకు ఉంటాడు. అర్జున్‌ను ఎలాగైనా ఐపీఎస్ అధికారిగా చూడాలనేది వైజయంతి కల. దాని కోసం ఆమె అతన్ని ఐపీఎస్ చదివించి శిక్షణ కోసం ఢిల్లీకి పంపుతుంది. ఏడాది శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి రావాల్సిన అర్జున్, వెళ్లిన ఐదో రోజే తిరిగి వస్తాడు. అందుకు కారణం అతని తండ్రి మరణం. నావికాదళ అధికారి అయిన అతని తండ్రి సముద్రంలో జరిగిన ప్రమాదంలో మరణించాడని పోలీసులు చెబుతారు. అయితే నిజానికి అర్జున్ తండ్రి మరణానికి కారణం ప్రమాదం కాదు, అది ఒక హత్య. ఆ విషయం తెలుసుకున్న అర్జున్, తన తండ్రిని చంపిన వారిపై పగ తీర్చుకోవాలనుకుంటాడు. కానీ వైజయంతి అతన్ని వారించి, చట్ట ప్రకారం దోషులకు శిక్ష పడేలా చూస్తానని చెబుతుంది. అంతేకాకుండా, అర్జున్‌ను ఐపీఎస్ పూర్తి చేయమని చెప్పి మళ్లీ శిక్షణకు పంపిస్తుంది. ఒక సంవత్సరం తర్వాత అర్జున్ శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి వస్తాడు. అదే రోజు అతని తండ్రి కేసు యొక్క తీర్పు వెలువడుతుంది. అర్జున్ తండ్రిది హత్య కాదని, అది ప్రమాదవశాత్తు జరిగిందని కోర్టు తీర్పు ఇస్తుంది. హంతకులు కోర్టు నుండి బయటకు వస్తూనే వైజయంతిని అవమానకరంగా మాట్లాడుతారు. అన్యాయం ముందు చట్టం మరియు న్యాయం ఓడిపోవడం అర్జున్ కళ్లారా చూస్తాడు. తన కళ్ల ముందే తల్లిని అవమానిస్తుంటే అతను తట్టు–కోలేకపోతాడు. అతని కోపం కట్టలు తెంచుకుంటుంది. కోర్టు ఎదురుగానే ఒక హంతకుడిని కొట్టి చంపేస్తాడు. అంతేకాదు, తన తండ్రి హత్యకు కారణమైన ముఠాలోని 41 మందిని నరికి చంపుతాడు. ఐపీఎస్ కావాల్సిన కొడుకు తన కళ్ల ముందే హంతకుడిగా మారడం చూసిన వైజయంతి దిగ్భ్రాంతికి గురవుతుంది. గూండాగా మారిన కొడుకుతోనే యుద్ధానికి సిద్ధమవుతుంది. మరి విధి వేరు చేసిన ఈ తల్లి కొడుకులు మళ్లీ ఎలా కలిశారు? ఐపీఎస్ అవ్వాల్సిన అర్జున్ గూండాగా మారి ఏమి సాధించాడన్నది మిగతా కథ.

# సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఎలెవన్ మూవీ




నవీన్ చంద్ర హీరోగా నటించిన 'ఎలెవన్' చిత్రం విడుదలకు ముందే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. విడుదలైన ప్రచార చిత్రాలు కూడా ఆసక్తికరంగా ఉండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా, చిత్ర యూనిట్ నిన్న మీడియా కోసం ప్రత్యేకంగా షోను ఏర్పాటు– చేసింది. సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాగా ఇది తెరకెక్కింది. విశాఖపట్నంలో వరుస హత్యలు సంచలనం సృష్టిస్తాయి. బాధితులను గుర్తించలేని స్థితిలో పోలీసులు తలలు పట్టుకుంటారు. ఈ కేసును డీల్ చేస్తున్న పోలీస్ ఆఫీసర్ శశాంక్‌కు ప్రమాదం జరగడంతో, ఏసీపీ అరవింద్ (నవీన్ చంద్ర) రంగంలోకి దిగుతాడు. అరవింద్ రంగంలోకి దిగిన కూడా హత్యలు ఆగవు. హంతకుడితో పాటు హత్యకు గురైన వారి ఆనవాళ్లు కూడా దొరకవు. సవాలుగా మారిన ఈ కేసులో చివరకు ఓ చిన్న ఆధారం లభిస్తుంది. అయితే ఈ క్లూతో నేరస్థుడిని అరవింద్ ఎలా పట్టుకున్నాడు. నేరస్థుడికి ఎవరు సహాయం చేశారు? అసలు ఆ సైకో ఎందుకు హత్యలు చేస్తున్నాడన్నదే అసలు కథ. సినిమా ప్రారంభంలో ఇది ఒక సాధారణమైన ఇన్వెస్టిగేటివ్ డ్రామా అనిపించినా, ఇంటర్వెల్ తర్వాత కథ ఊహించని మలుపు తిరుగుతుంది. ఫస్ట్ హాఫ్‌లో మనం ఊహించిన విధంగానే కథ సాగుతుంది. అయితే, సెకండ్ హాఫ్‌లో దర్శకుడు ఊహకు అందని ట్విస్ట్‌లతో ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాడు. ఇది కొత్త కథ కానప్పటికీ, తెలివైన కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం అభినందనీయం. రివెంజ్ స్టోరీలు చాలా చూసినప్పటికీ, ఇందులో చూపించిన అంశం లాజికల్‌గా ఉండటం విశేషం. ఒక పోలీస్ ఆఫీసర్ ఆరు హత్యల మిస్టరీని ఛేదించే క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లు, అనూహ్యమైన ట్విస్ట్‌లు ప్రేక్షకులను అలరిస్తాయి. అయితే, సినిమాలో మరికొంత మంది తెలిసిన నటీనటులు ఉంటే సినిమా మరింత మెరుగ్గా ఉండేదని చెప్పవచ్చు. నవీన్ చంద్ర పోలీస్ ఆఫీసర్ పాత్రలో అద్భుతంగా నటించాడు. ముఖ్యంగా కొన్ని ఎక్స్‌ప్రెషన్స్‌తో అతను ప్రేక్షకులను బాగా ఆకట్టు–కుంటాడు. హీరోయిన్ పాత్ర పరిమితంగా ఉన్నప్పటికీ, ఆ పాత్ర పోషించిన నటి తన పరిధి మేరకు బాగానే నటించింది. శశాంక్, కిరీటి వంటి ఇతర నటీ–నటు–లు కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. సినిమాటోగ్రఫీ సినిమాకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యాక గ్రౌండ్ స్కోర్ సినిమా యొక్క మూడ్‌ను మరింత ఎలివేట్ చేసింది. పాటలు అంతగా గుర్తుండి పోయేలా లేనప్పటికీ, నేపథ్య సంగీతం ఆకట్టుకుం టుంది.



# 5 సినిమాలని లైన్‌లో పెట్టిన క్రేజీ హీరో..

బాలీవుడ్ క్రేజీ హీరో విక్కీ కౌశల్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులని అలరించిన విక్కీ కౌశల్ లవ్ శవ్ తే చికెన్ ఖురానాలో చిన్న పాత్రతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత బాంబే వెల్వెట్, మసాన్, జుబాన్ వంటి చిత్రాలతో ప్రేక్షకులని పలకరించారు. 2018 లో విడుదలైన రాజీ చిత్రంతో ఆయనకు గుర్తింపు లభించింది. ఇప్పుడు విక్కీ కౌశల్ 5 సిని మాలని లైన్‌లో పెట్టినట్టు తెలుస్తుంది. ప్రస్తు తం ఆయన లవ్ అండ్ వార్ చిత్రంలో నటిస్తు న్నారు. ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా సాగు తుండగా, మూవీ 2026 లో విడుదల కావ చ్చు. ఈ చిత్రంలో విక్కీతో పాటు ఆలియా భ ట్, రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.